

పని ఒత్తిడి!

రోజంతా గూగుల్ మీట్‌లే!

పంచాయతీల్లో కుంటుపడుతున్న పాలన

జిల్లాలోని పంచాయతీ కార్యదర్శులు, ఈవోలకు అధికారులు నిర్వహిస్తున్న గూగుల్ మీట్‌లతో పంచాయతీల్లో పాలన కుంటుపడుతోంది. ఉదయం నుంచి రాత్రి వరకు మీటింగ్‌లకే పరిమితం కావడంతో ఎక్కడి పనులు అక్కడే నిలిచిపోతున్నాయి. రోజువారి కార్యక్రమాలకు తీవ్ర ఆటంకం ఏర్పడుతోంది. దీంతో కార్యదర్శులు, ఈవోలపై పని ఒత్తిడి పెరిగిపోతోంది. మరో వైపు ప్రభుత్వం గ్రామాల్లో పాలనాతీరుపై ఐవీఆర్ఎస్ సర్వేలు నిర్వహిస్తోంది. వీటిలో ఫిర్యాదులు అందితే సంబంధిత ఉద్యోగిపై చర్యలకు సిద్ధమవుతోంది. దీంతో ఎప్పుడు ఏం జరుగుతుందోనని అనుక్షణం భయంతో విధులు నిర్వర్తిస్తున్నారు.

- గ్రామ కార్యదర్శులు, ఈవోలపై పెరుగుతున్న పని భారం
- ఉదయం 11 నుంచి రాత్రి 8 గంటల వరకు వరుస మీటింగ్‌లు
- సమయం దొరక్క ఏ పనిచేయలేని నిస్సహాయ స్థితిలో ఉద్యోగులు
- ఇంటి పన్నుల బకాయిలు నెలాఖరులోగా వసూలు చేయాలని హుకుం
- మరో వైపు ఐవీఆర్ఎస్ సర్వే ఆధారంగా చర్యలకు ప్రభుత్వం ఉపక్రమణ



ఆంధ్రజ్యోతి-మచిలీపట్నం: జిల్లాలో 474 పంచాయతీలు ఉన్నాయి. వీటి పరిధిలో 120 మంది ఈవోలు, 280 మంది గ్రామ కార్యదర్శులు పని చేస్తున్నారు. గ్రామాల్లో ఉదయం ఆరు గంటలకు పంచాయతీ కార్యదర్శులు పారిశుధ్య పనులను పర్యవేక్షించాలి. తడి, పొడి చెత్తలను వేరు చేయడం, డ్రెయిన్‌లలో పూడికతీత, తాగునీటి సరఫరా, తాగునీటిలో క్లోరినేషన్ సక్రమంగా జరుగుతోందా లేదా అనే అంశాలను పర్యవేక్షించి సంబంధిత ఫొటోలను ఉదయం తొమ్మిది గంటలలోగా పైఅధికారులకు పంపాలి. ఈప్రక్రియ పూర్తయి కార్యాలయాలకు మిగతా 6లో..

ఏం జరుగుతుందోననే భయం!

పంచాయతీల్లో పౌరసేవలు సక్రమంగా అందుతున్నాయా లేదా అనే అంశంపై ప్రభుత్వం గ్రామాల్లో ప్రజల నుంచి ఐవీఆర్ఎస్ సర్వే ద్వారా వివరాలు సేకరిస్తోంది. దీంతో ప్రజలు తాము పడుతున్న ఇబ్బందులను, పంచాయతీలో పాలన బాగుంటే ఆ విషయాన్ని కూడా చెబుతున్నారు. మోపిదేవి పంచాయతీ రెగ్యులర్ కార్యదర్శిగా ఉన్న వ్యక్తి, అదే మండలంలోని పెదకళ్లేపల్లి పంచాయతీకి ఇన్‌చార్జి కార్యదర్శిగాను ఉన్నారు. ఇంటి పన్నుల వసూలు సక్రమంగా చేయలేదని, రెండు పంచాయతీలో పరిపాలన సక్రమంగా లేదనే కారణంతో సంబంధిత పంచాయతీ కార్యదర్శిని శుక్రవారం సస్పెండ్ చేశారు. రెండు లేదా మూడు పంచాయతీల్లో పరిపాలనా వ్యవహారాలను పర్యవేక్షిస్తున్న తమకు తగిన సమయం ఇవ్వకుండా గూగుల్ మీట్‌ల పేరుతో సమయమంతా అధికారులే తీసుకోవడంతో భవిష్యత్తులో తమపై ఎలాంటి చర్యలకు ఉపక్రమిస్తారోననే భయం వెంటాడుతోందని పంచాయతీ కార్యదర్శులు చెప్పుకుంటున్నారు.

వివిధ రకాల పనులతో సతమతం

జిల్లాలోని 474 పంచాయతీల్లో పెండింగ్‌లో ఉన్న ఇంటి పన్ను బకాయిలు ఈ నెలాఖరులోగా వసూలు చేయాలని పంచాయతీరాజ్ కమిషనర్ ఇటీవల ఆదేశాలు జారీ చేశారు. మరోవైపు స్వామిత్వ సర్వే చేసే పనిని అప్పగించారు. వీటితో పాటు పంచాయతీల్లో ప్రజలకు ఉపాధి అవకాశాలు చూపేందుకుగాను వర్క్‌ఫ్రమ్ హోం చేసేందుకు ఎంతమంది సుముఖంగా ఉన్నారనే అంశంపైనా సర్వే చేసి వివరాలు పంపాలని అధికారులు పంచాయతీ కార్యదర్శులపై ఒత్తిడి తెస్తున్నారు. దీంతో పాటు పంచాయతీ కార్యాలయాల్లో రోజువారీ పరిపాలనపరమైన పనులు చేయాల్సి ఉంది. ఈ పనులన్నీ చేయాలంటే తమకు సమయం ఇవ్వాలని, పనిచేయడానికి అవకాశం లేకుండా అధికారులు ఒకరి తర్వాత ఒకరు ఉదయం 11 గంటల నుంచి రాత్రి తొమ్మిది గంటల వరకు గూగుల్ మీట్‌లను పెడుతుంటే తామేమీ చేయలేకపోతున్నామని పంచాయతీ కార్యదర్శులు వాపోతున్నారు. ఇటీవల కొంతమంది పంచాయతీ కార్యదర్శులకు సంబంధించిన జిల్లా వాట్సాప్ గ్రూపుల్లో కుటుంబసభ్యులతో మాట్లాడటానికి కూడా సమయం ఉండటం లేదని పోస్టింగ్‌లు పెడుతుండటంతో ఈ అంశం చర్చనీయాంశంగా మారింది.

మీరే తేల్చుకోండి!

తహసీల్దార్ల అడ్‌హక్ పదోన్నతులపై కృష్ణా డీఆర్‌వో ఆఫర్!

- రెగ్యులర్ డీటీలు, ప్రొబేషనరీ డీటీల మధ్య చర్చలు ప్రారంభం
- 70-30 విధానంలో కేటాయింపునకు ఒప్పందం!
- రెగ్యులర్ డీటీలకు 16 పోస్టులు, ప్రొబేషనరీ డీటీలకు 4 పోస్టులు కేటాయించే అవకాశం
- ఆ ఒప్పందాన్ని వ్యతిరేకిస్తున్న పలువురు రెగ్యులర్ డీటీలు

తహసీల్దార్ల అడ్‌హక్ పదోన్నతులపై మీరే తేల్చుకుని రావాలంటూ రెగ్యులర్ డిప్యూటీ తహసీల్దార్‌లు, ప్రొబేషనరీ డిప్యూటీ తహసీల్దార్‌లకు కృష్ణాజిల్లా రెవెన్యూ యంత్రాంగం ఆఫర్ ఇచ్చింది. ఈ మేరకు కృష్ణా డీఆర్‌వో రెండు వర్గాలకు సూచించారు. రెవెన్యూలో తహసీల్దార్ల ఖాళీల నేపథ్యంలో రాష్ట్ర వ్యాప్తంగా అడ్‌హక్ పదోన్నతులు ఇస్తున్నప్పటికీ ఉమ్మడి కృష్ణాజిల్లాలో మాత్రం ఇవి జరగటం లేదు. దీనిపై 'ఆంధ్రజ్యోతి' ఇటీవల ప్రత్యేక కథనాన్ని ప్రచురించింది. దీనిపై కృష్ణాజిల్లా రెవెన్యూ యంత్రాంగంలో కదలిక వచ్చింది. ఇరువర్గాలు ఒక ఒప్పందానికి వస్తే అడ్‌హక్ పదోన్నతులు కల్పించేందుకు సిద్ధమైంది.

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

(ఆంధ్రజ్యోతి, విజయవాడ): ఉమ్మడి కృష్ణాజిల్లాలో మొత్తం 20 మంది తహసీల్దార్ల కొరత ఉన్న నేపథ్యంలో 23 మంది రెగ్యులర్ డీటీలు, 18 మంది పీడీటీలు అడ్‌హక్ పదోన్నతుల కోసం పోటీ పడుతున్నారు. ఉమ్మడి కృష్ణాజిల్లా జోన్ - 2 పరిధిలో ఉంది. ఉమ్మడి కృష్ణాతో పాటు పశ్చిమ గోదావరి, తూర్పు గోదావరి జిల్లాలు కూడా ఉన్నాయి. జోన్ - 2 పరిధిలో సీసీఎల్ఏ సీనియారిటీ జాబితా ప్రకారం చూస్తే రెగ్యులర్ డీటీలే ఉన్నారు. దీంతో పీడీటీలు కోర్టు మెట్లెక్కారు. దీనిపై స్టే వస్తే ఎటూ తేల్చని పరిస్థితి ఏర్పడుతోంది. 'ఆంధ్రజ్యోతి' కథనం నేపథ్యంలో కృష్ణాజిల్లా డీఆర్‌వో ఉభయ వర్గాలను పిలిచి.. అడ్‌హక్ పదోన్నతులు ఇవ్వటానికి అంగీకారం మిగతా 6లో..

అధికారులతో మాట్లాడుతున్న కలెక్టర్ బాలాజీ



అభివృద్ధి, సంక్షేమ నివేదికలు సిద్ధం చేయండి

అధికారులకు కలెక్టర్ బాలాజీ ఆదేశం

మచిలీపట్నం, సెప్టెంబరు 12 (ఆంధ్రజ్యోతి): రాజధాని అమరావతిలో ఈ నెల 15, 16 తేదీల్లో సీఎం చంద్రబాబు కలెక్టర్‌లతో కాన్ఫరెన్స్ నిర్వహించనున్నారని, ఈ లోగా జిల్లాలో అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలకు సంబంధించిన పూర్తిస్థాయి నివేదికలను సిద్ధం చేయాలని కలెక్టర్ బాలాజీ అధికారులను ఆదేశించారు. కలెక్టర్ చాంబరులో జేసీ గీతాంజలి శర్మతో కలసి శుక్రవారం వివిధ శాఖల అధికారులతో ఆయన సమావేశం నిర్వహించారు. మచిలీపట్నం పోర్టు పనులు ఇప్పటివరకు 47శాతం పూర్తయ్యాయని, మిగిలిన పనులను మరింత వేగవంతం చేయాలన్నారు. గిలకలదిండి హార్బర్ పనులు నిదానంగా సాగుతున్నాయని, ఇప్పటికే పనులు పూర్తిచేసేందుకు కాంట్రాక్టరుకు గడువును పలుమార్లు పొడిగించినట్టు తెలిపారు. మచిలీపట్నం పోర్టు నుంచి బైపాస్ రహదారుల నిర్మాణానికి అవసరమైన సమగ్ర నివేదికను తయారు చేయాలన్నారు. అక్టోబరు 15వ తేదీ నుంచి ఇసుకరేవులలో ఇసుకను తవ్వేందుకు రీచ్‌లను సిద్ధం చేయాలని చెప్పారు. జిల్లాలో పచ్చదనం పెంపుదలకు కార్యాచరణను రూపొందించాలని ఆదేశించారు. స్త్రీశక్తి పథకం ఉచిత బస్సు ప్రయాణంపై వివరాలు అడిగి తెలుసుకున్నారు. ప్రజాసమస్యల పరిష్కార వేదికలో వచ్చిన అర్జీల పరిష్కారంపైనా ఆరా తీశారు. ఈ సమావేశంలో గుడివాడ ఆర్డీవో సుబ్రహ్మణ్యం, గన్నవరం విమానాశ్రయ డైరెక్టర్ ఎం.ఎల్.కె.రెడ్డి, మచిలీపట్నం పోర్టు ఈడీ పల్లారావు, రైట్స్‌సంస్థ ప్రతినిధి ఎం.శ్రీనివాస్, ఆర్టీసీ డీఎం పెద్దిరాజు, వ్యవసాయశాఖ జేడీ పద్మావతి తదితరులు పాల్గొన్నారు.

ఉల్లితో అక్రమ వ్యాపారం

- రైతు బజారుల్లో ఎస్టేట్, మార్కెటింగ్ శాఖ అధికారుల నిర్వాకం

8

ఓపెన్ అవినీతి!

ఓపెన్ స్కూల్స్ ఫలితాల వెనుక భారీ దందా!

- ఉమ్మడి కృష్ణాజిల్లాలో రూ. 10 కోట్ల వరకు వసూలు!
- వైసీపీ ప్రభుత్వ హయాంలో మొదలు పెట్టిన ఓ గ్యాంగ్
- మూడేళ్లుగా కొనసాగుతున్న వ్యవహారం
- విద్యాశాఖ అధికారుల కార్యాలయంలోని వారితో కుమ్మక్కై..
- గతంలో ఆరోపణలు వచ్చినా.. మొక్కుబడిగా చర్యలు
- రాష్ట్ర విద్యాశాఖ మంత్రి, కమిషనర్‌కు ఫిర్యాదులతో విషయం వెలుగులోకి



విద్యాశాఖ ఓపెన్ స్కూల్ కేటగిరీలో ఉమ్మడి కృష్ణాజిల్లాలో అవినీతి తిమింగలాలు రాజ్యమేలుతున్నాయి. ఓపెన్ స్కూల్స్ నిర్వహణ పేరుతో అందినకాడికి విద్యార్థుల నుంచి దండుకుంటున్నాయి. తాము సూచించిన ఓపెన్ స్కూల్స్‌లో చేరితే పాస్ గ్యారంటీ అని ప్రచారం చేస్తున్నాయి. జిల్లా విద్యాశాఖ కార్యాలయాలలో పనిచేసే కొందరి సహాయ సహకారాలతో ఓపెన్ స్కూల్స్‌కు చెందిన ఒక అధికారి, గతంలో పని చేసిన అధికారి, ఓ ఆపరేటర్ గ్యాంగ్‌గా ఏర్పడి అక్రమ వసూళ్లకు పాల్పడినట్టుగా విమర్శలు వస్తున్నాయి.

(ఆంధ్రజ్యోతి, విజయవాడ): ఉమ్మడి కృష్ణాజిల్లాలో ఇటీవల జరిగిన ఓపెన్ స్కూల్స్ పరీక్షల్లో మాస్ కాపీయింగ్ జరగటం సంచలనం సృష్టించింది. విద్యాశాఖ కార్యాలయంలోని కొందరు అధికారులతో సంబంధాలు కలిగిన వసూళ్ల గ్యాంగ్ ఈ భారీ స్కామ్‌కు పాల్పడినట్టుగా తెలుస్తోంది. ఉమ్మడి కృష్ణా ఓపెన్ స్కూల్స్‌లో జరుగుతున్న అవినీతి వ్యవహారాలపై తాజాగా మంత్రి నారా లోకేశ్‌కు ఫిర్యాదు అందటంతో లోగుట్టు వ్యవహారాలు వెలుగు చూశాయి. విద్యాశాఖ కమిషనర్‌కు కూడా ఫిర్యాదులు వెళ్లాయి. దీంతో ఉమ్మడి కృష్ణా ఓపెన్ స్కూల్స్ వ్యవహారం తీవ్ర చర్చనీయాంశంగా మారింది. ఓపెన్ స్కూల్స్ విభాగంలో రూ.10 కోట్ల మేర స్కామ్ జరిగినట్టుగా విద్యాశాఖ కమిషనర్‌కు అందిన ఫిర్యాదును బట్టి తెలుస్తోంది.

వందకుపైగా స్కూళ్లు!

ఎన్టీఆర్, కృష్ణాజిల్లాల్లో పదవ తరగతి, ఇంటర్మీడియట్ ఓపెన్ స్కూల్స్ నిర్వహిస్తున్నారు. ప్రభుత్వం, ప్రైవేటు యాజమాన్యాల ఆధ్వర్యంలో వందకుపైగానే ఓపెన్ స్కూల్స్ ఉన్నాయి. ఓపెన్ స్కూల్స్‌లో మంచి ఫలితాలే వచ్చేవి. మాస్ కాపీయింగ్ ఆరోపణలు ఉండటం వల్ల కూడా ఫలితాలు ఎక్కువగా ఉండేవన్న ఆరోపణలు కూడా ఉన్నాయి. అయితే ఉన్నట్టుండి ఇటీవల కాలంలో మిగతా 6లో..

ఉన్నతాధికారులకు ఫిర్యాదులు

ఈ గ్యాంగ్ వ్యవహారం కృష్ణాజిల్లాలో కొంతమందికి తెలియటంతో వారు జిల్లా విద్యాశాఖ ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేశారు. ఈ ఫిర్యాదులపై విద్యాశాఖ ఉన్నతాధికారులు పూర్తి స్థాయి చర్యలు చేపట్టలేదు. ఒక ఆపరేటర్‌ను ఎన్టీఆర్ జిల్లాకు బదిలీ చేసి చేతులు దులుపుకున్నారు. ఆ తర్వాత ఎన్టీఆర్ జిల్లాలో కూడా ఇదే విధానాన్ని ఈ గ్యాంగ్ అమలు చేసింది. సడెన్‌గా ఉత్తీర్ణతా శాతాన్ని పడగొట్టి.. గతంలో కృష్ణా జిల్లాలో అనుసరించిన విధానాన్నే అనుసరించింది. కోచింగ్ సెంటర్ల నిర్వాహకులతో చేతులు కలిపి వారి ద్వారా ఓపెన్ స్కూల్స్‌కు అడ్మిషన్లు సాగించారు. కిందటి ఆగస్టు నెలలో ఈ తతంగాన్ని నడిపించారు. దీని వెనుక కూడా భారీ డీల్ నడిచిందని తెలుస్తోంది. రాష్ట్ర విద్యాశాఖాధికారులు జోక్యం చేసుకుంటే తప్ప .. ఉమ్మడి కృష్ణా జిల్లాలో ఓపెన్ స్కూల్స్ ప్రక్షాళన కాలేని పరిస్థితి నెలకొంది.

అటకెక్కిన విచారణ!

తాడిగడప మున్సిపాల్టీలో గతంలో యథేచ్ఛగా అక్రమ నిర్మాణాలు

- ఫ్లాట్ల కొనుగోలుదారుల నుంచి భారీగా అపరాధ రుసుము వసూలు
- వైసీపీ హయాంలో జరిగిన అక్రమాలపై ఫిర్యాదు చేసిన బాధితులు
- పూర్వ కమిషనర్లపై విచారణకు ఆదేశించిన కూటమి ప్రభుత్వం
- విచారణాధికారిని నియమిస్తూ జీవో జారీ
- ఇప్పటి వరకు విచారణకు రాని అధికారి

(ఆంధ్రజ్యోతి, విజయవాడ): తాడిగడప పురపాలక సంఘంలోని టౌన్ ప్లానింగ్ విభాగం పరిధిలో జరిగిన అవినీతి వ్యవహారాలపై విచారణ ఇంకా పెండింగ్‌లోనే ఉంది. అక్రమాలపై వచ్చిన ఫిర్యాదులతో పూర్వ మునిసిపల్ కమిషనర్లపై శాఖాపరమైన విచారణకు రాష్ట్ర ప్రభుత్వం ఆదేశించి నెలలు గడుస్తున్నా ఇప్పటి వరకు విచారణ జరగలేదు. దీనిపై సర్వత్రా విమర్శలు వ్యక్తమవుతున్నాయి. గత వైసీపీ ప్రభుత్వ హయాంలో తాడిగడప పురపాలక సంఘంలోని టౌన్ ప్లానింగ్ విభాగం నిబంధనలను మీరి అడ్డగోలుగా అనధికారిక కట్టడాలకు అనుమతులు ఇచ్చింది. సాధారణంగా 450 చదరపు గజాల స్థలంలో స్టిల్ట్ + గ్రౌండ్ + నాలుగు అంతస్తులకు అనుమతులు ఇస్తారు. కానీ 200 - 250 చదరపు గజాల లోపు ఉన్న స్థలాలకు కూడా అపార్ట్‌మెంట్ల తరహాలో స్టిల్ట్ + గ్రౌండ్ + నాలుగు అంతస్తులకు



అనుమతులు ఇచ్చేశారు. ఇలా అనధికారికంగా అనుమతులు ఇవ్వటం ఒక ఎత్తు అయితే.. వీటిలోని ఫ్లాట్లను కొనుగోలు చేసిన బాధితులను లక్ష్యంగా చేసుకుని బీపీఎస్ అమల్లో లేకపోయినా.. కొనుగోలుదారుల నుంచి అపరాధ రుసుమును వసూలు చేశారు. ఈ అపరాధ రుసుమును కూడా ఆస్తి పన్నులో కలిపి వసూలు చేశారు. వీటిపై కొందరు బాధితులు కూటమి ప్రభుత్వం వచ్చాక సాక్ష్యాధారాలతో సహా మిగతా 6లో..

దసరా ఉత్సవాల ఏర్పాట్లు ముమ్మరం

6

జాతీయ స్థాయి యోగాసన పోటీలకు మంత్రి రవీంద్రకు ఆహ్వానం



మంత్రి కొల్లు రవీంద్రకు ఆహ్వానపత్రం అందజేస్తున్న సురేంద్రనాథ్ బెనర్జీ

మచిలీపట్నం టౌన్, సెప్టెంబరు 12 (ఆంధ్రజ్యోతి) : విజయవాడ సిద్ధార్థ డిగ్రీ కళాశాలలో ఈనెల 28 నుంచి జరగనున్న జాతీయ స్థాయి యోగా పోటీల ప్రారంభోత్సవానికి రావాలని మంత్రి కొల్లు రవీంద్రను యోగాసన స్పోర్ట్స్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి పి.ప్రేమ్‌కుమార్, జాయింట్ సెక్రటరీలు అనంతనేని సురేంద్రనాథ్ బెనర్జీ, వై.దుర్గారావు కోరారు. ఈ మేరకు ఆయనకు ఆహ్వానపత్రిక అందజేశారు. ఈనెల 28, 29, 30, అక్టోబరు 1 తేదీలలో జరగనున్న జాతీయస్థాయి యోగా పోటీల్లో 22 రాష్ట్రాలు, కేంద్ర పాలిత ప్రాంత ప్రాంతాలు, రైల్వే ఉద్యోగులు 1200 మంది హాజరవుతున్నారన్నారు. యోగాతో ఆరోగ్యాన్ని సాధించే లక్ష్యంతో ఈ పోటీలను నిర్వహిస్తున్నామన్నారు. ఈ పోటీలకు ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు, విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్‌లను ఆహ్వానిస్తున్నామన్నారు. ఆర్టీసీ చైర్మన్ కొనకళ్ల నారాయణరావు, డీసీఎంఎస్ చైర్మన్ బండి రామకృష్ణ, కలెక్టర్ డీకే బాలాజీ, జాయింట్ కలెక్టర్ గీతాంజలి శర్మ, కృష్ణవిశ్వవిద్యాలయం ఉప కులపతి కూన రాంజీలను కూడా యోగాసన పోటీల ప్రతినిధులు కలిసి పోటీలకు ఆహ్వానించారు.



రంగనాయక స్వామి భూముల వద్ద మాట్లాడుతున్న టీడీపీ నాయకులు దిలీప్, గోపీచంద్, వడ్లమూడి లక్ష్మీనరసింహారావు

రంగనాయకస్వామి ఆలయ భూములను అనుయాయులకు కట్టబెట్టింది పేర్ని నానీనే

● భూముల వద్ద టీడీపీ నాయకులు ధ్వజం

మచిలీపట్నం టౌన్, సెప్టెంబరు 12 (ఆంధ్రజ్యోతి) : బందరు బైపాస్‌రోడ్డులోని రంగనాయకస్వామి దేవాలయ భూములను పేర్ని నాని తన అనుయాయులకు తక్కువ రేటుకు కట్టబెట్టారని టీడీపీ నాయకుడు దిలీప్ ఆరోపించారు. బైపాస్‌రోడ్డులో రంగనాయక స్వామి దేవాలయం భూముల వద్ద టీడీపీ నాయకులు విలేకరులతో మాట్లాడారు. 2006లో ఎండోమెంట్ కమిషనర్ ఆదేశాలు తీసుకువచ్చి ఐదెకరాల 33 సెంట్ల భూములను తక్కువ ధరకు పేర్ని నాని అనుయాయులకు ఇప్పించింది వాస్తవమా? కాదా అని ప్రశ్నించారు. గిడ్డంగుల నిర్మాణం కోసం వాకాలమ్మ ఆలయ భూములను మాజీ ఎమ్మెల్యే పేర్ని నాని తవ్వేశారని ఆరోపించారు. జిల్లా గ్రంథాలయ సంస్థ మాజీ అధ్యక్షుడు గొర్రెపాటి గోపీచంద్ మాట్లాడుతూ, వైసీపీ నాయకులు కమ్మవారి సత్రాన్ని ఆక్రమించే ప్రయత్నం చేశారన్నారు. గొడుగుపేట వేంకటేశ్వర స్వామి దేవస్థానం చైర్మన్ వడ్లమూడి లక్ష్మీనరసింహారావు మాట్లాడుతూ, విజయవాడ ఉత్సవం కోసం ఆలయ భూములను తాత్కాలికంగా ఇచ్చారన్నారు. మార్కెట్ యార్డు చైర్మన్ కుంచే నాని, కార్పొరేటర్ అన్నం ఆనంద్, పి.వి. ఫణికుమార్ తదితరులు పాల్గొన్నారు.

మోపిదేవి పంచాయతీ కార్యదర్శి సస్పెన్షన్



మల్లేశ్వరరావు

మోపిదేవి, సెప్టెంబరు 12 (ఆంధ్రజ్యోతి): మోపిదేవి గ్రామపంచాయతీ కార్యదర్శిగా విధులు నిర్వహిస్తున్న ఎం.మల్లేశ్వరరావును సస్పెండ్ చేస్తూ జిల్లా పంచాయతీ అధికారి ఆదేశాలు జారీ చేశారు. మోపిదేవి, పెదకళ్లేపల్లి ఇన్‌చార్జ్ కార్యదర్శిగా ఉన్న మల్లేశ్వరరావు పన్నులు వసూలు, ప్రభుత్వ కార్యక్రమాలకు హాజరులో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నట్లు ఆదే పంచాయతీ కార్యదర్శులు శాల్లో పేర్కొన్నారు. మోపిదేవి, పెదకళ్లేపల్లి గ్రామపంచాయతీల నుంచి కార్యదర్శి పనితీరుపై ఫిర్యాదులు మండల పరిషత్ ద్వారా జిల్లా కేంద్రానికి రావడంతో విచారణ నిర్వహించిన డీపీవో కలెక్టర్ ఆదేశాల మేరకు మల్లేశ్వరరావును సస్పెండ్ చేస్తూ ఆదేశాలు జారీ చేసినట్లు ఎంపీడీవో తెలిపారు.

పవన్‌కల్యాణ్‌పై వైసీపీ కార్యకర్త అనుచిత వ్యాఖ్యలు

● ఆర్ఎంపీ ఇంటి వద్ద జనసైనికుల ధర్నా

● సత్రంపాలెంలో ఉద్రిక్తత ● ఇరువర్గాలపై కేసులు నమోదు

మచిలీపట్నం క్రైమ్ సెప్టెంబరు 12 (ఆంధ్రజ్యోతి): ఉపముఖ్యమంత్రి పవన్ కల్యాణ్‌పై వైసీపీ కార్యకర్త, ఆర్ఎంపీ గిరిధర్ అనుచిత వ్యాఖ్యలు చేయడంతో బందరు మండలం సత్రంపాలెంలో ఉద్రిక్తత చోటు చేసుకుంది. జనసైనికులు ఆగ్రహం వ్యక్తం చేస్తూ ఆర్ఎంపీ ఇంటి వద్ద ధర్నా చేసి, పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఆర్ఎంపీ గిరిధర్‌కు మాజీ మంత్రి పేర్ని నాని మద్దతు తెలిపారు. డాక్టర్‌పై జనసైనికులు దాడి చేయడాన్ని పేర్ని ఖండించారు. డీఎస్పీతో పేర్ని ఫోన్‌లో మాట్లాడారు. అనుచిత వ్యాఖ్యలు చేసినందుకు డాక్టర్‌పై, దురుసుగా ప్రవర్తించినందుకు జనసైనికులపై పోలీసులు కేసులు నమోదు చేశారు.



ఇంద్రకీలాద్రిపై వాటర్ ప్రూఫ్ టాప్‌ల నిర్మాణ పనులు



ఫుట్ రోడ్డులో క్యూలైన్ల నిర్మాణం



ఫ్లై ఓవర్ కింద పనులు పర్యవేక్షిస్తున్న ఏసీపీ దుర్గారావు

దసరా ఉత్సవాల ఏర్పాట్లు ముమ్మరం

● శరవేగంగా పనులు ● షెడ్ల నిర్మాణం, బారికేడ్ల ఏర్పాట్లు

ఇంద్రకీలాద్రి, సెప్టెంబరు 12 (ఆంధ్రజ్యోతి) : ఇంద్రకీలాద్రిపై దుర్గామల్లేశ్వర దేవస్థానంలో నిర్వహించే దసరా మహోత్సవాలకు ఏర్పాట్లు ముమ్మరంగా జరుగుతున్నాయి. ఉపరితల ఆవర్తనం కారణంగా రెండు మూడు రోజుల్లో వానలు పడకుంటే ఇంతకుముందు అధికారులు చెప్పినట్లుగా ఈనెల 15 నాటికి అన్ని ఏర్పాట్లు పూర్తి అయ్యే అవకాశం ఉంది. షెడ్ల పనులు రెండు మూడు రోజుల్లో పూర్తి కానున్నాయి. కొండ దిగువన, కొండ ఎగువన బారికేడ్ల ఏర్పాటు ముమ్మరంగా జరుగుతోంది. కెనాల్ రోడ్డులోని వినాయకుడి గుడి నుంచి క్యూలు ప్రారంభమవుతాయి. మూడు లైన్లుగా బారికేడ్లను అమర్చారు. భక్తులకు ఒత్తిడి లేకుండా ఏర్పాట్లు చేస్తున్నారు. వాటర్ ప్రూఫ్ టాప్‌లను వేయాల్సి ఉంది. సీతమ్మవారి పాదాల వద్ద ఏర్పాటు చేస్తున్న తాత్కాలిక కేశఖండనశాల షెడ్లు, భక్తులు వేచి ఉండే ఏరియాల్లో షెడ్లు, కనకదుర్గానగర్‌లో ఇంకా మరికొన్ని పనులు, రోడ్లు, స్థలాల చదును పనులను యుద్ధప్రాతిపదికన చేసేందుకు ప్రయత్నిస్తున్నారు.



భక్తుల రద్దీని నిలువరించేందుకు పూల మార్కెట్ పక్కన ఖాళీ స్థలాన్ని చదును చేయిస్తున్న దేవస్థానం సిబ్బంది

కొండ దిగువన, కొండ ఎగువన విద్యుదీకరణ పనులు పూర్తి కావాల్సి ఉంది. అన్న ప్రసాదాల తయారీ పోటు, లడ్డూ ప్రసాదాల తయారీ పోటు, తదితరాలు పూర్తి కావాల్సి ఉంది. యాగశాల ఏర్పాట్లు పూర్తి కావస్తున్నాయి. ఇప్పటి వరకు 70 శాతం పనులు పూర్తి అయ్యాయని సమాచారం. వాతావరణంలో మార్పులు లేకుండా ఉంటే మిగతా పనులు రానున్న రెండు, మూడు రోజుల్లో పూర్తయ్యే అవకాశం ఉంది. ఈ దసరాకు కిందటి సంవత్సరం కంటే ఎక్కువ మంది భక్తులు వస్తారని అంచనా వేస్తున్నారు. అందుకు అనుగుణంగా ఏర్పాట్లు జరుగుతున్నాయి. దేవస్థానంలో దసరా సందర్భంగా నిర్వహించే పూజలకు సంబంధించిన రుసుముల విషయంలో ఇంకా స్పష్టత రాలేదు. ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్, పోలీసు కమిషనర్ ఎస్.వి. రాజశేఖర్ బాబు, కమిషనర్ ధ్యానచంద్ర పనులను పరిశీలించారు.



దసరా పనుల కాంట్రాక్టర్ల సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ లక్ష్మీశ

దసరా పనుల్లో నాణ్యత పాటించాలి : కలెక్టర్ లక్ష్మీశ

ఇంద్రకీలాద్రి, సెప్టెంబరు 12 (ఆంధ్రజ్యోతి) : దసరా పనుల్లో నాణ్యత పాటించాలని, అలసత్వం వహించిన వారిపై శాఖాపరమైన చర్యలు తీసుకుంటామని ఎన్టీఆర్ కలెక్టర్ డాక్టర్ జి.లక్ష్మీశ అన్నారు. తన కార్యాలయంలో శుక్రవారం దుర్గగుడి ఈవో, ఇంజనీరింగ్ అధికారులు, దసరా మహోత్సవాల పనుల కాంట్రాక్టర్లతో సమావేశం నిర్వహించారు. భక్తులకు చేసే ఏర్పాట్లు విషయంలో ఎలాంటి అలసత్వం వహించవద్దన్నారు. భక్తితో పని చేయాలని, నాణ్యత ప్రమాణాలు పాటించాలని కాంట్రాక్టర్లకు సూచించారు. సమన్వయంగా పనిచేసి దసరా ఉత్సవాలను అత్యంత వైభవంగా నిర్వహించడానికి దోహదపడాలన్నారు. ఫిర్యాదులు లేదా సమస్యలు ఉంటే నేరుగా ఈవో, దేవదాయశాఖ కమిషనర్, జిల్లా కలెక్టర్ దృష్టికి తీసుకువస్తే తక్షణమే చర్యలు తీసుకుని పరిష్కరిస్తామన్నారు.

నారికంపాడు భూమి దేవుడిమాన్యం కాదు

● అబద్ధపు రాతలతో విషం చిమ్ముతోన్న జగన్ పత్రిక

● తప్పుడు కథనాలపై ఎమ్మెల్యే కొలికపూడి ఖండన



తిరువూరు, సెప్టెంబరు 12 (ఆంధ్రజ్యోతి) : జగన్ పత్రిక తప్పుడు కథనాలతో అసత్యాలతో ప్రజల్ని గందరగోళానికి గురి చేస్తూ విషం చిమ్ముతోందని ఎమ్మెల్యే కొలికపూడి శ్రీనివాసరావు విమర్శించారు. క్యాంప్ కార్యాలయంలో గురువారం ఆయన విలేకరులతో మాట్లాడారు. ఎన్టీఆర్ జిల్లా గంపలగూడెం మండలం నారికంపాడులో 1036 ఎకరాల దేవుడి భూమి నిషేధిత జాబితా నుంచి తొలగించి కూటమి నాయకులు అక్రమించే ప్రయత్నం చేస్తున్నారంటూ జగన్ పత్రికలో వచ్చిన కథనాన్ని ఆయన తీవ్రంగా ఖండించారు. నారికంపాడులోని భూములు దేవుడి మాన్యం కాదని, భూ సంస్కరణల చట్టం ద్వారా జమిందారీ భూముల్ని పట్టాలుగా ఇచ్చారన్నారు. నారికంపాడు ప్రాంతం గతంలో జమిందారీ పాలనలో ఉండేదన్నారు. రాష్ట్రం ఏర్పడిన తర్వాత భూసంస్కరణల చట్టాల్లో భాగంగా, జమిందారీ వ్యవస్థను రద్దు చేశారన్నారు. నారికంపాడులో ఉన్న1036 ఎకరాల జమిందారీ భూముల్ని అప్పట్లో సాగుచేసుకుంటున్న వారికే రైతువారీ పట్టాలు ఇచ్చారన్నారు. 2014లో రాష్ట్ర విభజన అనంతరం 1036 ఎకరాల్లో దాదాపు 500 ఎకరాలు ఖమ్మం జిల్లా పరిధిలోకి వెళ్లాయన్నారు. ప్రస్తుతం నారికంపాడు వద్ద ఉన్న 532 ఎకరాలు దేవుడి మాన్యం కాదని, రైతుల పట్టాభూములు మాత్రమే అన్నారు. గతంలో 1036 ఎకరాలు రైతులకు పట్టాలు ఇచ్చేసమయంలో వినగడప వేణుగోపాలస్వామి ఆలయానికి ప్రతిసంవత్సరం ఎకరానికి ఒక్క రూపాయి చొప్పున రైతులు చెల్లించాలనే షరతు విధించారన్నారు. ఆ నిబంధనల ప్రకారం 2014 వరకు ప్రతి సంవత్సరం జిల్లా కలెక్టర్ ద్వారా రూ.1036 ఆలయానికి చెల్లించే వారన్నారు. 2016లో కృష్ణా జిల్లా కలెక్టర్‌గా విధులు నిర్వహించిన ప్రభాకరరెడ్డి ఈ 1036 ఎకరాల భూముల్ని హోల్డ్‌లో పెట్టి, భూముల రిజిస్ట్రేషన్లు నిలుపు చేశారన్నారు. నాటినుంచి ప్రజలు తమ భూముల్ని నిషేధిత భూముల జాబితా నుంచి తొలగించాలని కోరుతూ వస్తున్నారన్నారు. తాను ఎమ్మెల్యేగా ఎన్నికైన అనంతరం 532 ఎకరాల భూమిని నిషేధిత జాబితా నుంచి తొలగించాలని దేవదాయ మంత్రి, రెవెన్యూ మంత్రిని కలిసి విజ్ఞప్తి చేయగా, సమస్య పరిష్కారం దిశగా కలెక్టర్ చర్యలు తీసుకుంటున్నారన్నారు. దీనిపై జగన్ పత్రిక బురద జల్లే కుట్రకు పూనుకుందన్నారు. నారికంపాడు ప్రాంతంలో రైతులతో శనివారం సమావేశం నిర్వహిస్తానని తెలిపారు. రాజవరపు శ్రీనివాసరావు, వాకదాని లక్ష్మీనారాయణ పాల్గొన్నారు.

అమరావతిపై జగన్ కుట్రలు మళ్లీ మొదలయ్యాయి!

● మాజీ మంత్రి దేవినేని ఉమామహేశ్వరరావు



గొల్లపూడి, సెప్టెంబరు 12 (ఆంధ్రజ్యోతి): అమరావతి పై జగన్ కుట్రలు మళ్లీ మొదలయ్యాయని మాజీ మంత్రి, టీడీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి దేవినేని ఉమామహేశ్వరరావు అన్నారు. గొల్లపూడిలో శుక్రవారం ఆయన విలేకరు లతో మాట్లాడారు. ప్రజారాజధాని అమరావతిపై జగన్ రెడ్డి కుట్రలు మొదలు పెట్టారని ఆరోపించారు. జగన్ అనుచరులు సజ్జల రామకృష్ణారెడ్డి, బుగ్గన రాజేంద్రనాథ్ రెడ్డిల ద్వారా అసలు కుట్రలు బయట పడుతున్నాయన్నారు. జగన్‌రెడ్డి ఆధ్వర్యంలో మరోసారి అమరావతిపై అసత్య ప్రచారాలు, దుష్ప్రచారాలు జరుగుతున్నాయన్నారు. అమరావతి రైతులపై పెట్టిన కేసులు, మహిళలపై చేసిన దాష్టీకాలు ప్రజలు ఇంకా మరచిపోలేదన్నారు. మూడు ముక్కలాటతో రాష్ట్రాన్ని చీల్చాలని కుట్రలు చేసి, అభివృద్ధిని వెనక్కి నెట్టిన వారికి అమరావతి గురించి మాట్లాడే నైతిక హక్కు లేదన్నారు. ప్రజలు తిరస్కరించిన నేత తిరిగి మళ్లీ ఏ ముఖం పెట్టుకొని రాజధాని గురించి మాట్లాడతారని ప్రశ్నించారు. ఎన్ని కుట్రలు చేసినా, అమరావతిని ప్రజల రాజధానిగా, విశాఖను ఐటీ హబ్‌గా, రాయలసీమను అగ్రికల్చర్ హబ్‌గా తీర్చిదిద్దే బాధ్యత చంద్రబాబు నాయుడు నేతృత్వంలోని కూటమికే చెల్లుతుందన్నారు.

మీరే తేల్చుకోండి!

(5వ పేజీ తరువాయి)

తెలిపారు. అడ్‌హక్ పదోన్నతులు ఇవ్వాలంటే ఉభయ వర్గాలు ఒక అవగాహన కు రావాల్సిందిగా సూచించారు. అడ్‌హక్ పదోన్నతులకు సంబంధించి 50 - 50 లేదా 70 - 30 విధానంలో మీ మధ్య ఆమోదయోగ్యమైన ఒప్పందం చేసుకుని రావాల్సిందిగా ఆఫర్ ఇచ్చారు. దీనిపై పీడీటీలు సుముఖంగానే ఉన్నా.. రెగ్యులర్ డీటీలు మాత్రం తర్జన భర్జనలు పడుతున్నారు. రెగ్యులర్ డీటీలు మొత్తం 23 మంది ఉన్నారు. సీసీఎల్ఏ సీనియారిటీ జాబితా ప్రకారం చూసినా వీరిలో 20 మందికే అడ్‌హక్ పదోన్నతులు వస్తాయి. ముగ్గురు వేచి చూడాల్సి వస్తోంది. పూర్తిగా అందరికీ పదోన్నతులు రావు. దీనిని దృష్టిలో పెట్టుకుని రెగ్యులర్ డీటీలు, పీడీటీలతో సమావేశమై 70 - 30 విధానంలో అడ్‌హక్ పదోన్నతులను పంచుకుందామని లోపాయికారీగా ఒప్పందాన్ని కుదుర్చుకున్నారు. రెగ్యులర్ డీటీలు 23 మందిలో ముగ్గురు అడ్‌హక్ పదోన్నతులను స్వీకరించబోమని.. తమకు నేరుగా ప్రమోషన్లు వచ్చినపుడే స్వీకరిస్తామని చెప్పటంతో ప్రస్తుతం 20 మందే రంగంలో ఉన్నారు. ఈ 20 మందిలో మరో నలుగురు పీడీటీలతో 70 - 30 ఒప్పందాన్ని వ్యతిరేకిస్తున్నారు. దీనిని కనుక అంగీకరిస్తే నలుగురికి పదోన్నతులు రావు. పీడీటీలతో కుదుర్చుకున్న 70 - 30 ఒప్పందం ప్రకారం చూస్తే 20 రెగ్యులర్ డీటీలలో 16 మందికి మాత్రమే అవకాశం లభిస్తుంది. పీడీటీల విషయానికి వస్తే మొత్తం 18 మంది అడ్‌హక్ పదోన్నతుల కోసం ఎదురు చూస్తున్నారు. వీరిలో నలుగురికి మాత్రమే పదోన్నతులకు అవకాశం కలుగుతుంది. రెగ్యులర్ డీటీలు నలుగురు 70-30 ఒప్పందాన్ని వ్యతిరేకిస్తుండటంతో .. ప్రస్తుతం అడ్‌హక్ పదోన్నతులకు అడ్డంకిగా మారింది. ఈ కారణం చేత నలుగురు రెగ్యులర్ డీటీలను బుజ్జగించే ప్రయత్నాలు చేస్తున్నారు. ఇవి కనుక ఒక కొలిక్కి వస్తే .. అడ్‌హక్ పదోన్నతులకు లైన్ క్లియర్ అవుతుంది. ప్రస్తుతం వారి ని బుజ్జగించే పనిలో రెగ్యులర్ డీటీలు ఉన్నారు.

జాప్యం జరిగే అవకాశం!

కృష్ణాజిల్లా రెవెన్యూ యంత్రాంగం తీసుకుంటున్న చర్యలు మంచివే అయినప్పటికీ.. అడ్‌హక్ పదోన్నతులలో ఉభయులను ఒప్పందం చేసుకోమనటం వివాదాస్పదంగా మారుతోంది. రెగ్యులర్ పదోన్నతులకు సంబంధించి ఉభయుల మధ్యన వివాదం నడుస్తోంది. ఈ వివాదం తేలే వరకు రెగ్యులర్ పదోన్నతులు ఇవ్వకపోయినా ఇబ్బంది ఉండదు. కానీ ప్రజల సమస్యలను దృష్టిలో పెట్టుకుని అవసరాల రీత్యా వేసే అడ్‌హక్ పదోన్నతులకు సంబంధించి నిర్ణయం తీసుకునే విషయంలో ఉభయ పక్షాలను పిలిపించాల్సిన అవసరం లేదన్న వాదనలు కూడా వినిపిస్తున్నాయి. ఏది ఏమైనప్పటికీ ఉభయులను మాట్లాడుకుని రావాల్సిందిగా ఇచ్చిన ఆఫర్ మంచిదే అయినా.. వాళ్ల మధ్య సంధి కుదరకపోతే మాత్రం అడ్‌హక్ పదోన్నతులు జాప్యమయ్యే అవకాశాలు ఉన్నాయి.

ఓపెన్ అవినీతి!

(5వ పేజీ తరువాయి)

కృష్ణాజిల్లాలో ఓపెన్ స్కూల్స్ ఫలితాల శాతం దారుణంగా పడిపోయింది. దీని వెనుక లోగుట్టు ఎవరికీ అర్థం కాలేదు. ఓపెన్ స్కూల్ పరీక్షలను అత్యంత కఠినంగా నిర్వహించటం వెనుక ఓ గ్యాంగ్ హస్తం ఉందన్నది ఆ తర్వాత కానీ బోధపడలేదు. ప్రైవేటు సంస్థల పరిధిలో నిర్వహించే ఓపెన్ స్కూల్స్‌కు, ఈ గ్యాంగ్‌కు మంచి సంబంధాలు ఉండేవి. వాటితో ఈ గ్యాంగ్‌కు ఇబ్బంది ఉండేది కాదు. ప్రభుత్వ స్కూళ్లలో, కాలేజీలలో నిర్వహించే ఓపెన్ స్కూల్స్ విషయంలో మాత్రం తాము వేసిన వసూళ్ల ప్రణాళికకు అనుగుణంగా కృష్ణాజిల్లాలో నిర్వహించిన పరీక్షలను ఈ గ్యాంగ్ టార్గెట్‌గా చేసుకున్నట్టు తెలుస్తోంది. పథకం ప్రకారం ఉత్తీర్ణతా శాతం పడగొట్టిన తర్వాత ఈ గ్యాంగ్ నేతృత్వంలోనే జెడ్పీ పాఠశాలలు, ప్రభుత్వ కళాశాలల్లో మరికొన్ని స్టడీ సెంటర్లను ప్రారంభించారని తెలుస్తోంది. రెండు జిల్లాల్లో తాము ఏర్పాటు చే యించిన ఓపెన్ స్కూల్స్‌లో చేరిన వారికి పాస్ గ్యారంటీ అన్న హామీ ఇచ్చి తెర వెనుక వందలాది మందికి ఆఫర్ ఇచ్చి అడ్మిషన్లు ఇప్పించినట్టు తెలుస్తోంది. ఇలా అడ్మిషన్లు పొందిన వారి నుంచి ఒక్కొక్కరి దగ్గర వేలాది రూపాయలను వసూలు చేసినట్టు తెలుస్తోం ది. తమ ఆఫర్ల ద్వారా అడ్మిషన్లు పొందిన విద్యార్థులను పాస్ చేయించటానికి విద్యాశాఖ అధికారుల కార్యాలయంలోని కొం దరు అధికారులతో తమకు ఉన్న సన్నిహిత పరిచయాల కారణంగా ప్రభుత్వ పాఠశాలల టీచర్లను, హెచ్ఎంలను పరీక్షల సూపరింటెండెంట్లుగా, ఇన్విజిలేటర్లుగా నియమించటంలో సఫలీకృతమైనట్టు సమాచారం. వీరి ద్వారా పరీక్షలలో మాస్ కాపీయింగ్ చేయించి 99 శాతం ఉత్తీర్ణత తీసుకువచ్చారని తెలిసింది. అసలు అభ్యర్థుల బదులు నకిలీ అభ్యర్థులతో కూడా పరీక్షలు రాయించినట్టు సమాచారం. ఈ వ్యవహారాలను గత మూడు సంవత్సరాలుగా గుట్టుగా నడిపిస్తున్నారని, ఈ పేరుతో రూ.10 కోట్ల వరకు వసూలు చేశారని తెలుస్తోంది.

పని ఒత్తిడి!

(5వ పేజీ తరువాయి)

వచ్చిన తర్వాత ఉదయం 11 గంటలకు పంచాయతీ డివిజనల్ అధికారులు (డీఎల్‌పీవో) గూగుల్ మీట్ ప్రారంభమవుతుంది. మధ్యాహ్నం 1.30 గంటల వరకు కొనసాగుతుంది. భోజన విరామం అనంతరం మధ్యాహ్నం మూడు గంటలకు డీఎల్‌పీవోలు చేసిన సూచనలను పాటిస్తున్నారా లేదా అనే అంశంపై డిప్యూటీ ఎంపీడీవోలు (ఈవోపీఆర్డీ) మళ్లీ గూగుల్ మీట్ ప్రారంభిస్తున్నారు. నాలుగు గంటలు లేదా 4.30 గంటలకు ముగిస్తున్నారు. ఈ ప్రక్రియ అవ్వగానే ఎంపీడీవోలు పంచాయతీల్లో చేపట్టాల్సిన వివిధ రకాల పనులపై గూగుల్ మీట్‌ను ప్రారంభిస్తున్నారు దీంతో సాయంత్రం అవుతోంది. ఈ రోజుకు గూగుల్ మీట్‌లు పూర్తయ్యాయని అనుకునేలోపుగానే జిల్లా పంచాయతీ అధికారి (డీపీవో) గూగుల్ మీట్ సాయంత్రం ఆరు గంటలకు ప్రారంభిస్తున్నారు. ఒక్కోరోజు రాత్రి 8.30 నుంచి తొమ్మిది గంటల వరకు ఈ గూగుల్ మీట్ కొనసాగుతూ ఉంటుంది. ఉదయం 11 గంటల నుంచి భోజన విరామ సమయం తప్ప మిగిలిన అన్ని గంటలు గూగుల్ మీట్‌లలోనే పంచాయతీ ఈవోలు, కార్యదర్శులు ఉండిపోతున్నారు. దీంతో పంచాయతీ కార్యాలయాల్లో ఒక్క పనీ సక్రమంగా జరగని పరిస్థితి ఏర్పడింది. అధికారులు చెప్పే విషయాన్ని సూటిగా చెప్పకుండా గంటల తరబడి గూగుల్ మీట్‌లలో చెబుతున్నారని, ఒక అధికారి చెప్పిన విషయాన్ని మళ్లీ ఇంకో అధికారి చెబుతుండటంతో ఏం చేయాలో పాలుపోవడం లేదని పంచాయతీ కార్యదర్శులు, ఈవోలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

ప్రాణాలు నిలిపే ప్రథమ చికిత్స

నేడు ఫస్ట్ ఎయిడ్ డే సందర్భంగా ప్రత్యేక కథనం

(ఇబ్రహీంపట్నం-ఆంధ్రజ్యోతి)

సారీ...సమయానికి తీసుకొచ్చి ఉంటే ప్రాణాన్ని కాపాడేవాళ్లం..., సమయానికి తీసుకురాబట్టే ప్రాణాలు కాపాడగలిగాం.. ఇలాంటి పదాలు తీవ్రంగా గాయాలు పాలైన రోగుల గురించి పలు సందర్భాల్లో వైద్యులు నోట వింటుంటాం. గాయాల పాలైన, సడన్‌గా అనారోగ్యానికి గురైన వారికి ప్రథమ చికిత్స (ఫస్ట్ ఎయిడ్) ఎంత అవసరమో వారి మాటలను చూస్తే అర్థం అవుతుంది. ఫస్ట్ ఎయిడ్ అంటే ఏమిటి? దాని ప్రాముఖ్యత ఏమిటో ప్రతి ఒక్కరూ తెలుసుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉంది. ఈనెల 13న శుక్రవారం ఫస్ట్ ఎయిడ్ డేపై ప్రత్యేక కథనం

ఫస్ట్ ఎయిడ్ డే లక్ష్యం

1. అవగాహన పెంచడం : ఫస్ట్ ఎయిడ్ ప్రాముఖ్యతను తెలియజేయడం, అవగాహన పెంపొందించడం, ప్రాథమిక చికిత్సతో ప్రాణాలను ఎలా రక్షించాలో వివరించడం.
2. నైపుణ్యాలను నేర్పడం : ప్రజలకు ప్రథమ చికిత్స నైపుణ్యాలను నేర్పడం ద్వారా అత్యవసర సందర్భాల్లో ఆత్మ విశ్వాసంతో, సమర్థవంతంగా ప్రతి స్పందించడానికి సిద్ధం చేయడం.
3. జీవిత రక్షణ : ప్రమాదాలు లేదా అనారోగ్య పరిస్థితుల్లో తక్షణమే సరైన ప్రాథమిక చికిత్స అందించడం ద్వారా ప్రాణ నష్టం లేదా తదుపరి వచ్చే ఇబ్బందులను తగ్గించడం.
4. సామాజిక బాధ్యత: ప్రతి ఒక్కరూ సమాజంలో ఇతరుల జీవితాలను రక్షించడంలో భాగస్వామ్యం కలిగి ఉండేలా ప్రోత్సహించడం.



గుండె పోటుకు గురైన వ్యక్తికి ప్రాథమిక వైద్యం చేస్తున్న డాక్టర్

ఫస్ట్ ఎయిడ్ ఎందుకంటే.

అత్యవసర పరిస్థితులు ఎప్పుడైనా, ఎక్కడైనా సంభవిస్తాయి. ఫస్ట్ ఎయిడ్ చేయడం పట్ల అవగాహన ఉంటే ప్రమాద సమయలోఓ గాయపడిన వ్యక్తి జీవితాన్ని రక్షించవచ్చు. గాయం తీవ్రతను లేదా అనారోగ్యం తీవ్రతను తగ్గించవచ్చు. విద్యుదాఘాతం, గుండెపోటు, రక్తస్రావం, శ్వాస అవరోధం, కాలిన గాయాలు వంటి అత్యవసర పరిస్థితుల్లో నిర్దిష్టమైన ఫస్ట్ ఎయిడ్ చర్య చేయాలి.

ఫస్ట్ ఎయిడ్ నైపుణ్యం అవశ్యం



ఏ రోగికైనా, ప్రమాదాలకు గురైన వారికైనా ప్రథమ చికిత్స ఎంతో అవసరం. ప్రాణాపాయ స్థితి నుంచి కాపాడేందుకు తొలిగా చేయాల్సిన పనే ఫస్ట్ ఎయిడ్. తక్షణం ఫస్ట్ ఎయిడ్ అందితే ప్రాణాపాయం నుంచి కాపాడుకునే వీలుంటుంది. ప్రతి ఒక్కరికీ ఫస్ట్ ఎయిడ్ నైపుణ్యం ఎంతైనా అవసరం.

- డాక్టర్ విజయ్‌కుమార్, ఇబ్రహీంపట్నం పట్టణ ఆరోగ్యకేంద్రం

అత్యవసర సమయంలో ఫస్ట్ ఎయిడ్ తప్పనిసరి



అత్యవసర సమయంలో ఫస్ట్ ఎయిడ్ ఎంతో అవసరం. గుండెపోటు వచ్చిన సమయంలో సీపీఆర్ చేసి వైద్యశాలకు తరలించవచ్చు. పాము కాటుకు గురైన వారికి ఫస్ట్ ఎయిడ్ చేసి విషం శరీరం మొత్తం పాకకుండా చేయవచ్చు. ఫస్ట్ ఎయిడ్ అనేది కేవలం వైద్య వృత్తిలో ఉన్న వారే కాదు, వలంటీర్లు చేయవచ్చు. జీవితాన్ని కాపాడేదాన్ని ఫస్ట్ ఎయిడ్ అంటారు.

- డాక్టర్ ప్రసన్నరాణి, జి.కొండూరు పీహెచ్‌సీ

అటకెక్కిన విచారణ!

(5వ పేజీ తరువాయి)

ఫిర్యాదు చేశారు. దీనిపై ప్రభుత్వం గతంలో పనిచేసిన మునిసిపల్ కమిషనర్లు ముగ్గురుపై శాఖాపరమైన విచారణకు ఆదేశించింది. ఏకంగా విచారణాధికారిగా డీటీసీపీలో పనిచేసే జీవీజీఎస్‌వీ ప్రసాద్ అనే అధికారిని విచారణాధికారిగా నియమించింది. నెలలు గడుస్తున్నా ఇప్పటి వరకు ఆయన తాడిగడప మునిసిపాలిటీకి వచ్చి పరిశీలించింది లేదు. విచారించింది లేదు. గత వైసీపీ ప్రభుత్వ హయాంలో జరిగిన అవినీతి అక్రమాలపై విచారణాధికారి కనీసం తెలుసుకునే ప్రయత్నం కూడా చేయలేదు. దీనిపై ఫిర్యాదుదారులు ఆ విచారణాధికారి దగ్గరకు వెళ్లి అడగ్గా తనను విచారణ అధికారిగా నియమించినట్టు కాపీ రాలేదని చెప్పటం సంచలనం సృష్టిస్తోంది. ప్రభుత్వం జీవో జారీ చేసిన తర్వాత.. సదరు విచారణాధికారికి ఎందుకు కాపీ వెళ్లలేదో అర్థం కాని విషయంగా మారింది. తనకు కాపీ వచ్చినా ఉద్దేశ్యపూర్వకంగా విచారణాధికారి పక్కన పెట్టాడా అన్న ఆరోపణలు కూడా వస్తున్నాయి. ఈ అంశంపై రాష్ట్ర ప్రభుత్వం జోక్యం చేసుకుని విచారణాధికారి నుంచి వివరణ తీసుకోవాల్సిన అవసరం ఉంది.

12 బార్‌లు లాటరీ పద్ధతిన కేటాయింపు 18న

మచిలీపట్నం, సెప్టెంబరు 12 (ఆంధ్రజ్యోతి) : కృష్ణాజిల్లాలోని 12 బార్ అండ్ రెస్టారెంట్‌లకు ఈనెల 18వ తేదీన కలెక్టరేట్‌లో లాటరీ పద్ధతిన కేటాయించడం జరుగుతుందని ఎక్సైజ్ విభాగం సూపరింటెండెంట్ జి గంగాధరరావు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈనెల 17వ తేదీ సాయంత్రం 6గంటల వరకు బార్ అండ్ రెస్టారెంట్లకు దరఖాస్తుల స్వీకరించనున్నట్లు ఆయన తెలిపారు. గుడివాడలో 6, మచిలీపట్నంలో 4, పెడన పురపాలకసంఘంలో ఒకటి, మంగినపూడిలో ఒకటూరిజం బార్‌కు దరఖాస్తుల స్వీకరణకు ప్రభుత్వం అనుమతులు ఇచ్చిందన్నారు. మచిలీపట్నం, గుడివాడలలోని బార్‌లకు ఏడాదికి రూ.55 లక్షలు, పెడన, మంగినపూడిలోని టూరిజం బార్‌లకు ఏడాదికి రూ.35 లక్షల చొప్పున లైసెన్స్‌ఫీజుగా నిర్ణయించినట్లు తెలిపారు. వివరాలకు జిల్లా ఎక్సైజ్ కార్యాలయంలో సంప్రదించాలని ఆయన సూచించారు.

బ్రాయిలర్ ధరలు

అమరావతి (రూ.లలో)

బ్రాయిలర్ బర్డ్	140, 149, 160
చికెన్ విత్ స్కిన్	268
చికెన్ స్కిన్‌లెస్	278



నెక్ కోడిగుడ్డు ధర (100)

విజయవాడ జోన్ రైతు ధర రూ. 545

బోధనేతర పనుల నుంచి ఉపాధ్యాయులకు విముక్తి కలిగించాలి



గన్నవరం, సెప్టెంబరు 12 (ఆంధ్రజ్యోతి) : ఉపాధ్యాయులకు బోధనేతర పనుల నుంచి విముక్తి కలిగించాలని యూటీఎఫ్ జిల్లా కోశాధికారి మరీదు వరప్రసాద్ అన్నారు. ఆర్థిక, విద్యారంగ సమస్యలపై రణభేరి పోస్టర్‌ను శుక్రవారం స్థానిక విద్యా వనరుల కేంద్రం వద్ద ఆవిష్కరించారు. ఈ నెల 15నుంచి 19 వరకు జిల్లాలో రణభేరి బైక్ ర్యాలీ జరుగుతుందన్నారు. జీవి రవిబాబు, జి.రాజాబాబు, తాతా శ్రీనివాసరావు, దాసరి శివప్రసాద్, శ్రీనివాస నాయక్, బాలసుబ్బమ్మ, సుజాశ్రీ, సీహెచ్ రత్నకుమారి తదితరులు పాల్గొన్నారు.

రైతులందరికీ యూరియా అందిస్తాం



ముస్తాబాద పీఏసీఎస్‌లో యూరియా అందజేస్తున్న అధ్యక్షురాలు రమ

గన్నవరం, సెప్టెంబరు 12 (ఆంధ్రజ్యోతి) : రైతులకు సరిపడే యూరియా అందుబాటులో ఉందని ఎవరు అధైర్యపడాల్సిన పనిలేదని పీఏసీఎస్ అధ్యక్షురాలు మేడేపల్లి రమ అన్నారు. మండలంలోని ముస్తాబాద పీఏసీఎస్‌లో శుక్రవారం రైతులకు యూరియా అందజేశారు. ఈ సందర్భంగా రమ మాట్లాడుతూ, ప్రతి ఒక్క రైతుకి యూరియా అందజేసేందుకు ప్రభుత్వం కట్టుబడి ఉందన్నారు. నియోజకవర్గంలో యూరియా కొరత లేకుండా ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావు ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటున్నారని తెలిపారు. డైరెక్టర్‌లు షేక్ కరిముల్లా, పల్లి కార్తిక్, ఏవో కె.శివప్రసాద్ పాల్గొన్నారు.

కాలువలోకి దూకి యువకుడు ఆత్మహత్య

గన్నవరం, సెప్టెంబరు 12 (ఆంధ్రజ్యోతి): ప్రేమించి పెళ్లి చేసుకున్న భార్య పుట్టింటికి వెళ్లిపోగా మనస్తాపం చెందిన ఆ యువకుడు పోలవరం కాలువలో దూకి ఆత్మహత్య చేసుకున్నాడు. ఆత్కూరు పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. నూజివీడు మండలం పటమట బిగవల్లికి చెందిన బత్తుల సత్య ప్రకాష్ (21) ఆగిరిపల్లి మండలం పోతవరప్పాడులో ఎన్నారై కళాశాలలో బీటెక్ చదువుతున్నాడు. అదే కళాశాలలో చదువుతున్నఈదరకు చెందిన యువతితో ప్రేమ మొదలైంది. గతేడాది డిసెంబరులో విజయవాడ కనకదుర్గమ్మ ఆలయంలో ప్రేమ వివాహం చేసుకుని ఆగిరిపల్లి పోలీసులను ఆశ్రయించారు. అప్పుడు ఆ యువతీ తల్లిండ్రులు ఆమెకు నచ్చజెప్పి ఇంటికి తీసుకువెళ్లారు. అప్పటి నుంచి సత్య ప్రకాష్ డిప్రెషన్‌లో ఉంటున్నాడు. శుక్రవారం విజయవాడ గుడికి వెళ్లి వస్తానని తండ్రి దగ్గర డబ్బులు తీసుకుని స్నేహితులైన పృధ్వీతో కలసి బయలుదేరాడు. వాళ్లిద్దరు వీరపనేనిగూడెం రాగా అక్కడ ఉన్న పోలవరం కాలువ వద్ద ఆపి కాలువలోకి సత్య ప్రకాష్ దూకేశాడు. నీటమునిగి అక్కడికక్కడే మృతి చెందాడు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు

ఉరేసుకుని విద్యార్థి ..

పెనమలూరు, సెప్టెంబరు 12 (ఆంధ్రజ్యోతి) : ఉరేసుకుని పాలిటెక్నిక్ విద్యార్థి(18)మృతి చెందిన ఘటనపై పెనమలూరు పోలీసులు కేసు నమోదు చేశారు. పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. పెదపులిపాక శ్రీనగర్ కాలనీకి చెందిన పుట్టపు గోవిందమ్మకు ఇద్దరు కుమారులు ఆమె చిన్న కుమారుడు పవన్‌కుమార్ వడ్డేశ్వరంలోని ఒక ప్రైవేటు పాలిటెక్నిక్ కళాశాలలో మూడవ సంవత్సరం పాలిటెక్నిక్ చదువుతున్నాడు. గురువారం ఉదయం కళాశాలకు వెళ్లి తిరిగి వచ్చేశాడు. అతని అన్న ఇంటికి వచ్చేసరికి ఫ్యాన్‌కు వేలాడుతూ పవన్ కనిపించాడు. తలుపులు పగలకొట్టి పవన్‌ను ఆసుపత్రికి తరలించగా వైద్యులు అప్పటికే మృతి చెందాడని తెలిపారు. పోలీసులు కేసు నమోదు చేశారు.

పీవీపీ సిద్ధార్థ కళాశాలలో రక్తదానం



కానూరు, సెప్టెంబరు 12 (ఆంధ్రజ్యోతి) : కానూరులోని పీవీపీ సిద్ధార్థ ఇంజనీరింగ్ కళాశాలలో ఎన్‌ఎస్ఎస్ విభాగం ఆధ్వర్యంలో శుక్రవారం జరిగిన రక్తదాన శిబిరంలో 105 మంది విద్యార్థులు రక్తదానం చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన పీవీపీ ఎస్ఐటీ కన్వీనర్ వెల్లంకి నాగభూషణరావు రక్తదాన శిబిరాన్ని ప్రారంభించి మాట్లాడుతూ, రక్తదానం అన్నిదానాల కన్నా మిన్న అని, ప్రతిఒక్కరూ విధిగా రక్తదానం చేయాలని సూచించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ డాక్టర్ కొండపల్లి శివాజీబాబు, వెల్లంకి లలిత, టి. శ్రీహరిరావు, డాక్టర్ శ్యామ్ పాల్గొన్నారు.

నీర్లక్ష్యం..!



- దోసపాడు చానల్ ద్వారా కలవపాముల పరిధిలో పొలాలకు నీరందక రైతుల అగచాట్లు
- బ్రాంచి కాల్వకు నీరు వదలాలని కోరినా పట్టించుకోని ఇరిగేషన్ అధికారులు
- బీటలువారుతున్న వరిపొలాలు

(ఉయ్యూరు -ఆంధ్రజ్యోతి)

కృష్ణానదికి వరదలతో ప్రకాశం బ్యారేజి గేట్ల ద్వారా వేలాది టీఎంసీల నీరు సముద్రం పాలవుతుంటే మరోపక్క వరి పొలాలకు సాగు నీరందక భూమి బీటలువారుతున్న పరిస్థితుల్లో రైతులు ఆందోళన చెందుతున్నారు. ఇరిగేషన్ అధికారుల నిర్లక్ష్యం కారణంగా కలవపాముల పరిధి నందమూరు రోడ్డులో వరి పొలాలకు నీరందక భూమి బీటలువారి పచ్చగా ఎదిగిన పైరు ఎండిపోయే దుస్థితి నెలకొంది. దోసపాడు చానల్ నుంచి నంబర్‌వన్ బ్రాంచి కాల్వ ద్వారా నందమూరు రోడ్డులో షుమారు 150 ఎకరాలు, న్యూ చానల్, గరప కాల్వల ద్వారా మరో రెండువందల ఎకరాల్లో రైతులు వరిపంట సాగు చేస్తున్నారు. దోసపాడు చానల్ నుంచి నంబవర్ చానల్ ఇతర కాల్వకు సరిపడా నీరు వదలక పోవడంతో దిగువపొలాలు ఎండిపోయే పరిస్థితి నెలకొంది. కాల్వకు నీరు వదలాలని ఇరిగేషన్ అధికారులకు మొరపెట్టుకున్నా పట్టించుకోక పోగా వంతులువారి నీరు వదులుతామని అధికారులు చెప్పడం హాస్యాస్పదంగా ఉందని రైతులు మండిపడుతున్నారు.

ఇబ్బందిలేకుండా చర్యలు తీసుకుంటాం

దిగువ ప్రాంతాలకు నీరందించేందుకు కలవపాముల పరిధి నందమూరురోడ్డులో కాల్వలకు డ్రాపులు దించేస్తాం. ఎప్పటి నుంచో అమలులో ఉన్న విధంగా శనివారం ఉదయం నుంచి సోమవారం ఉదయం వరకు నందమూరు రోడ్డులో కాల్వలకు నీరు వదులుతాము. ఇంతకు ముందు నీరిచ్చినప్పుడు రైతులు పెద్దగా ఉపయోగించుకోపోవడం వల్ల ఈపరిస్థితి నెలకొంది.

\- రాజగోపాల్, ఇరిగేషన్ ఏఈ



సదస్సుకు హాజరైన విద్యార్థినులు

సిద్ధార్థలో ఆరోగ్యంపై అవగాహన సదస్సు

కానూరు, సెప్టెంబరు 12 (ఆంధ్రజ్యోతి): కానూరులోని సిద్ధార్థ డీమ్డ్ యూనివర్సిటీలో శుక్రవారం ఎన్ఎస్ఎస్ యూనిట్ ఆధ్వర్యంలో మహిళల ఆరోగ్యంపై అవగాహన సదస్సు జరిగింది. ఈ సదస్సులో విజయవాడ రెయిన్‌బో హాస్పిటల్స్ సీనియర్ కన్సల్టెంట్ డాక్టర్ ఎం. విజయ ముఖ్యఅతిథిగా పాల్గొని ప్రసంగిస్తూ మహిళలు సమతుల ఆహారం తీసుకోవాలని, క్రమం తప్పకుండా ఆరోగ్యపరీక్షలు చేయించుకోవాలని సూచించారు. కార్యక్రమంలో వర్సిటీ వీసీ పరుచూరి వెంకటేశ్వరరావు, ప్రొ. వీసీ ఏవీ రత్నప్రసాద్, రిజిస్ట్రార్ ఎం. రవిచంద్, ఎన్ఎస్ఎస్ అధికారులు డాక్టర్ జె. శివరాంప్రసాద్, డాక్టర్ సుష్మా చౌదరి, డీన్ డాక్టర్ వెంకట్రావు తదితరులు పాల్గొన్నారు.

లా కళాశాలలో మాక్‌టెస్ట్ నేడు

రాష్ట్రవ్యాప్తంగా కొత్తగా న్యాయశాస్త్ర పట్టా పొంది న్యాయవాద వృత్తిలోకి అడుగు పెట్టాలనుకొనే విద్యా ర్థులకు కానూ రులోని సిద్ధార్థ లా కళాశాలలో శనివారం ఏఐబీఈ (ఆలిండి యా బార్ ఎగ్జామి నేషన్) మాక్‌టెస్ట్ నిర్వహిస్తున్నట్లు ప్రిన్సిపాల్ డాక్టర్ సీహెచ్ దివాకర బాబు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. సిద్ధార్థ లా కళాశాల, ఇండియన్ అసోసియేషన్ ఆఫ్ లాయర్స్ సంయుక్త ఆధ్వర్యంలో ఉదయం 10 గంటలకు పరీక్ష నిర్వహిస్తామని పేర్కొన్నారు.

నేపాల్‌లో తెలుగువారిని స్వదేశానికి తీసుకురావడంలో

మంత్రి లోకేశ్ కృషి అభినందనీయం

పెనమలూరు, సెప్టెంబరు12 (ఆంధ్రజ్యోతి): సంక్షోభంలో పడ్డ నేపాల్‌లో చిక్కుకున్న తెలుగు వారిని స్వదేశానికి రప్పించడంలో విశేష కృషి చేసిన మంత్రి నారా లోకేశ్ అభినందనీయుడని టీడీపీ తాడిగడప మునిసిపాలిటీ అధ్యక్షుడు అనుమోలు ప్రభాకరరావు, టీడీపీ మండల అధ్యక్షుడు కోయ ఆనంద్ ప్రసాద్‌లు పేర్కొన్నారు. శుక్రవారం పోరంకి టీడీపీ కార్యాలయంలో వారు మాట్లాడుతూ, తండ్రికి తగ్గ తనయుడిగా గతంలో సీఎం చంద్రబాబు ఉత్తరాఖండ్ ప్రళయంలో చిక్కుకున్న తెలుగువారిని ఏవిధంగా కాపాడుకున్నారో అదే మాదిరి నేపాల్‌లో ఉన్న తెలుగువారిని తిరిగి స్వదేశానికి తీసుకురావడంలో లోకేశ్ చేసిన కృషి తెలుగువారు మరిచిపోరని తెలిపారు. ఒక పక్క అనంతపురం సభకు వెళ్లాల్సి ఉన్నా.. సభకు కూడా వెళ్లకుండా కేంద్ర ప్రభుత్వ సహకారంతో, ఢిల్లీ ఏపీభవన్‌లో కంట్రోల్‌రూం ఏర్పాటు చేసుకొని వారికి ఆహారం, తాగునీరు అందిస్తూ వారిని తిరిగి స్వదేశానికి తీసుకురావడంలో విజయం సాధించారని కొనియాడారు.

విద్యుత్ చౌర్యానికి పాల్పడితే చర్యలు

హనుమాన్‌జంక్షన్, సెప్టెంబరు 12 (ఆంధ్రజ్యోతి) : బాపులపాడు మండలంలో నిర్వహించిన ఆకస్మిక తనిఖీల్లో చట్ట విరుద్ధంగా విద్యుత్ వినియోగిస్తున్న వారికి రూ7.06 లక్షలు జరిమాన విధించినట్లు ఏపీసీపీడీసీఎల్ గుడివాడ డివిజన్ ఈఈ జీబి శ్రీనివాసరావు తెలిపారు. జంక్షన్ సబ్ డివిజన్ పరిధిలోని పలు గ్రామాల్లో విద్యుత్ శాఖ, విజిలెన్స్ ఈఈ సీహెచ్ వాసు ఆధ్వర్యంలో 47 బృందాలుగా ఏర్పడి శుక్రవారం తనిఖీలు నిర్వహించారని, 417 సర్వీసులను పరిశీలించగా అదనపులోడు వినియోగిస్తున్నట్లు తనిఖీల్లో వెల్లడైందన్నారు. వారందరికి జరిమాన విధించినట్లు తెలిపారు.

వేమండ పీఏసీఎస్ త్రిసభ్య కమిటీ ప్రమాణస్వీకారం



వేమండ సొసైటీ చైర్‌పర్సన్ విశ్వనాథానికి నియామకపత్రం అందజేస్తున్న కూటమి నేతలు

ఉంగుటూరు, సెప్టెంబరు 12 (ఆంధ్రజ్యోతి) : రైతుల ఆర్థికాభివృద్ధికి చేయూతనందించడంద్వారా పీఏసీఎస్‌ల బలోపేతానికి నూతన త్రిసభ్యకమిటీలు కృషి చేయాలని టీడీపీ వేమండ గ్రామ అధ్యక్షుడు తోట నాగభూషణం అన్నారు. స్థానిక పీఏసీఎస్ త్రిసభ్యకమిటీ ప్రమాణ స్వీకారం శుక్రవారం టీడీపీ, జనసేన నాయకుల సమక్షంలో ఘనంగా జరిగింది. సొసైటీ చైర్‌పర్సన్‌గా కొల్లి విశ్వనాథం, పర్సన్లుగా కొత్తపల్లి శివనాగేశ్వరరావు, శనగవరపు వెంకట శ్రీనివాసరావులు బాధ్యతలు స్వీకరించారు. ఈసందర్భంగా టీడీపీ గ్రామఅధ్యక్షుడు తోట నాగభూషణం, జనసేనపార్టీ మండల అధ్యక్షుడు భువనం భాస్కర్ నూతన కమిటీకి నియామకపత్రాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు చల్లగుళ్ల నాగరాజు, శనగవరపు సుబ్బారావు, హనుమోలు శ్రీధర్, సొసైటీ సెక్రటరీ జున్ను వరకుమార్, గుమాస్తా శనగవరపు రమేష్, కూటమి నాయకులు, బ్యాంక్ సిబ్బంది పాల్గొన్నారు.

సూపర్‌సిక్స్ పథకాల అమలుపై ఇంటింటా ప్రచారం



ఇంటింటా ప్రచారంలో కూటమి నేతలు

ఉయ్యూరు, సెప్టెంబరు 12 (ఆంధ్రజ్యోతి) : సూపర్‌సిక్స్ సంక్షేమ పథకాలు అమలు చేస్తూ ముఖ్యమంత్రి చంద్రబాబు ఎన్నికల హామీ నెరవేర్చుతుంటే ఓర్వలేని వైసీపీ నాయకులు విషం చిమ్ముతున్నారని తెలుగు యువత జిల్లా అధ్యక్షుడు దండమూడి చౌదరి ఆరోపించారు. గండిగుంటలో శుక్రవారం పర్యటించి కూటమి ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు ఇంటింటా ప్రచారం చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, స్త్రీశక్తి పథకం ద్వారా రాష్ట్రంలో మహిళలకు ఆర్టీసీ బస్సులలో ఉచిత ప్రయాణం కల్పిస్తే ముఖ్యమంత్రికి మహిళలు నీరాజనాలు పలుకుతున్నారని, వైసీపీ నాయకులు ఓర్వలేక దుష్ప్రచారం చేస్తున్నారని పేర్కొన్నారు. పార్టీ నాయకులు గుండె రాంబాబు, కోటేశ్వరరావు, రసూల్, దత్త

హత్య కేసులో నిందితుడికి జీవిత ఖైదు

పెనమలూరు, సెప్టెంబరు 12 (ఆంధ్రజ్యోతి) : ఐదేళ్ల క్రితం రోకలిబండతో తలపై మోది ఒక మహిళను హత్య చేసిన వ్యక్తికి విజయవాడ మహిళా సెషన్స్ కోర్టు న్యాయమూర్తి జి రాజేశ్వరి జీవిత ఖైదు, ఐదువేల జరిమానా విధిస్తూ గురువారం తీర్పు వెలువరించారు. పెనమలూరు సీఐ జే వెంకటరమణ తెలిపిన వివరాల మేరకు.. కంకిపాడుకు చెందిన ముప్పిడి శ్రీనివాసరావు 2020 మేలో గంగూరు బిగ్‌బాస్కెట్ గోదాము వద్ద టీ అమ్ముకొని జీవనం సాగించే మహిళతో వివాహేతర సంబంధం కొనసాగించాడు. ఈ క్రమంలో ఆర్థికపరమై వివాదం రావడంతో శ్రీనివాసరావు రమాదేవిని రోకలిబండతో తలమీద కొట్టి హత్య చేశాడు. అప్పటి సీఐ సత్యనారాయణ శ్రీనివాసరావును అరెస్టు చేసి కేసు నమోదు చేసి రిమాండుకు పంపారు. 13మంది సాక్షులను విచారించిన విజయవాడ సెషన్స్ కోర్టు న్యాయమూర్తి రాజేశ్వరి గురువారం శ్రీనివాసరావుకు జీవితఖైదు, రూ.ఐదువేలు జరిమానా విధిస్తూ తీర్పు చెప్పారు.

టీడీపీ నాయకుడు సుజన్‌బాబు

మృతి పార్టీకి తీరనిలోటు

ఉంగుటూరు, సెప్టెంబరు 12 (ఆంధ్రజ్యోతి) : టీడీపీ మండల ఉపాధ్యక్షుడు తాతినేని సుజన్‌బాబు (55) అకాలమరణం పార్టీకి తీరనిలోటని పలువురు నాయకులు అన్నారు. ఆత్కూరుకు చెందిన సుజన్‌బాబు అనారోగ్య(లివర్)సమస్యకు ఆస్పత్రిలో చికిత్స పొందుతూ గురువారం రాత్రి తుదిశ్వాస విడిచారు. పార్టీకార్యక్రమాల్లో చురుకుగా పాల్గొంటూ 2024 ఎన్నికల్లో కూటమి ప్రభుత్వం గెలుపుకు సుజన్‌బాబు విశేషంగా కృషిచేశారు. కుమార్తె అమెరికాలో ఎంఎస్ చదువుతోంది. శుక్రవారం ఉదయం ఆయన పార్థివదేహాన్ని ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావు సోదరుడు సతీష్, ఏఎంసీ వైస్‌చైర్మన్ కొండేటి వెంకటేశ్వరరావు, కుందేటి చంద్రశేఖర్, అట్లూరి రామ్‌కిరణ్, పోతినేని రామకృష్ణ తదితర నాయకులు సందర్శించి పూలమాలవేసి నివాళులర్పించారు. అనంతరం స్థానిక హిందూ శ్మశానవాటికలో తండ్రి తాతినేని గోపాలకృష్ణ చేతులమీదుగా సుజన్‌బాబు అంతిమసంస్కారాలు జరిగాయి.

ఉపాధి పనులు పారదర్శకంగా చేపట్టాలి

డ్వామా పీడీ ఎన్వీ శివప్రసాద్ యాదవ్



ప్రజావేదిక నిర్వహిస్తున్న పీడీ

హనుమాన్‌జంక్షన్, సెప్టెంబరు 12(ఆంధ్రజ్యోతి): గ్రామీణ ప్రాంతాల కూలీల ఉపాధి లబ్ధి కోసం కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న ఉపాధి హామీ పథకం పనులు పారదర్శకంగా చేపట్టాలని డ్వామా పీడీ ఎన్వీ శివప్రసాద్ యాదవ్ క్షేత్రస్థాయి సిబ్బందికి సూచించారు. శుక్రవారం బాపులపాడు మండల కార్యాలయం వద్ద మండలంలో 2024-25 ఆర్థిక సం వత్సరంలో నిర్వహించిన రూ. 18 కోట్లు విలువ చేసే ఉపాధి పనులపై నిర్వహించిన సామాజిక తనిఖీలపై పీడీ ప్రజావేదిక నిర్వహించారు. బాధ్యతా రహితంగా వ్యవహరించిన ఫీల్డు అసిస్టెంట్‌ను సస్పెండ్ చే యాలని ఆ శాఖ అధికారులను పీడీ ఆదేశించారు. కార్యక్రమంలో అంబుడ్స్ మెన్ కె.శ్రీనివాసరావు, ఎస్సాఆర్పీ సుబ్బారావు, ఎంపీపీ వై.నగేష్, జడ్పీటీసీ సభ్యు రాలు కె. గంగాభవాని, ఎంపీడీవో కె.జోగేశ్వరరావు, పీఆర్ ఏఈ జయరాజు, ఏపీవో అశోక్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

కమ్మ కార్పొరేషన్ ద్వారా పేదలకు చేయూత



కమ్మ కార్పొరేషన్ డైరెక్టర్ సూర్యంను సత్కరిస్తున్న టీడీపీ నేతలు

హనుమాన్‌జంక్షన్‌రూరల్, సెప్టెంబరు 12(ఆంధ్రజ్యోతి) : కార్పొరేషన్ ద్వారా పేద కుటుంబాల్లోని యువతకు చేయూత నందించి స్వయం సాధికారితకు తోడ్పాడునందిస్తానని రాష్ట్ర కమ్మ కార్పొరేషన్ డైరెక్టర్ చిరుమామిళ్ల సూర్య నారాయణప్రసాద్ (సూర్యం) తెలిపారు. కేసరపల్లిలోని ఆయన నివాసంలో శుక్రవారం బాపులపాడు మండల నాయకులు మర్యాదపూర్వకంగా కలిసి ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో డీసీ చైర్మన్ కొమ్మారెడ్డి రాజేష్, జిల్లా తెలుగు యువత అధికార ప్రతినిధి గండేపూడి నితీష్‌కుమార్, బొమ్ములూరు సర్పంచ్ కాటూరు విజయభాస్కర్, కొమ్మారెడ్డి సాయి, రవి, పచ్చిగళ్ల శ్రీనివాసరావు, అప్పారావు, కోటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

కానూరు, సెప్టెంబరు 12 (ఆంధ్రజ్యోతి) : మహదేవపురం కాలనీ సబ్‌స్టేషన్ కానూరు ఫీడర్ పరిధిలో విద్యుత్ లైన్ల మరమ్మతుల్లో భాగంగా శనివారం ఉదయం 8నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు పలు ప్రాం తాల్లో విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు విద్యుత్ శాఖ గుణదల ఇన్‌చార్జి ఈఈ ఈ. రమణమూర్తి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. మహ దేవపురం కాలనీ, టీచర్స్ కాలనీ, తులసీనగర్, సనత్‌నగర్, అశోక్‌నగర్, పంటకాలువరోడ్డు, బందరురోడ్డు ఆర్టీసీ టెర్మినల్ నుంచి పప్పులమిల్లు సెంటర్ వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు పేర్కొన్నారు. అదే విధంగా శ్రీరాంనగర్ సబ్‌స్టేషన్ పరిధిలో ఉదయం 9నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు ఈఈ తెలిపారు. శ్రీరాంనగర్, కామయ్యతోపు సెంటర్, చలసానినగర్, కేసీపీ కాలనీ, రాంప్రియనగర్, బంద రురోడ్డు తాడిగడప సెంటర్ నుంచి కామయ్యతోపు సెంటర్ వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు ఆయన పేర్కొన్నారు.

గన్నవరం : స్థానిక విద్యుత్ సబ్‌స్టేషన్ పరిధిలోని పలు గ్రామాల్లో శనివారం ఉదయం 8 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు ఏఈ వెంకటరాజు ఒక ప్రకటనలో పేర్కొన్నారు. గన్నవరం, మర్లపాలెం, చినఅవుటపల్లి, దుర్గాపురం, ఎయిర్‌పోర్టు సిటీ, స్టేట్ స్కూల్, గొల్లనపల్లి, బీబీగూడెం ప్రాంతాల్లో నెలకొన్న విద్యుత్ సమస్యలను పరిష్కరించేందుకు సరఫరా నిలిపివేస్తున్నామని తెలిపారు.

హనుమాన్‌జంక్షన్ : జంక్షన్ విద్యుత్ సబ్‌స్టేషన్‌లో శనివారం మరమ్మతులు నిర్వహిస్తున్నందున సబ్‌స్టేషన్ పరిధిలోని పలుగ్రామాల్లో ఉదయం 8 నుంచి మధ్యాహ్నం 12 గంటలు వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు జంక్షన్ సబ్‌స్టేషన్ ఇన్‌చార్జి ఏఈ రుక్మిణికల్యాణి ఒక ప్రకటనలో తెలిపారు. బాపులపాడు, ఎస్ఎన్ పాలెం, కె.ఎస్.పురం గ్రామాలకు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు పేర్కొన్నారు.

ఉంగుటూరు : తేలప్రోలు సెక్షన్ పరిధిలోని 33/11కేవీ పెదఅవుటపల్లి విద్యుత్ సబ్‌స్టేషన్ ఫీడర్ లైన్ల మరమ్మతులు చేపడుతున్నారు. ఈ నేపథ్యంలో శనివారం ఉదయం 7 నుంచి 10గంటలవరకు పెదఅవుటపల్లిలో విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని విద్యుత్‌శాఖ గుడివాడ డివిజన్ ఈఈ జీబీ శ్రీనివాసరావు ఒక ప్రకటనలో తెలిపారు. అదేవిధంగా ఉంగుటూరు సెక్షన్ పరిధిలోని 33/11కేవీ నందమూరు విద్యుత్‌సబ్‌స్టేషన్ మరమ్మతుల నిమిత్తం ఇందుపల్లి, వేమండ, నందమూరు, మానికొండ, చాగంటిపాడు, చికినాల, బొకినాల, మధిరపాడు గ్రామాల్లో శనివారం ఉదయం 8 నుంచి 11 గంటలవరకు విద్యుత్ సరఫరా నిలుపుదల చేస్తున్నట్లు ఈఈ పేర్కొన్నారు.




శిక్షణార్థులతో ఆర్బీఐ, యూబీఆర్ఎస్ఈటీఐ ప్రతినిధులు

సైబర్ నేరాలపై అవగాహన ఉండాలి

ఉంగుటూరు, సెప్టెంబరు 12 (ఆంధ్రజ్యోతి) : సైబర్‌నేరాలపట్ల యువత స్పష్టమైన అవగాహన కలిగివుండాలని ఆర్బీఐ హైదరాబాద్ డీజీఎం అండ్ డిప్యూటీ అంబుడ్స్‌మన్ పి.కళ్యాణచక్రవర్తి అన్నారు. ఆత్కూరు స్వర్ణభారత్‌ట్రస్ట్ ఆవరణలోని యూనియన్ బ్యాంక్ గ్రామీణస్వయం ఉపాధి శిక్షణా కేంద్రం (యూబీ ఆర్ఎస్ఈటీఐ)లో శిక్షణార్థులకు సైబర్ నేరాలపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా సురక్షిత డిజిటల్ బ్యాంకింగ్ ఎలా చేసుకోవాలి, సైబర్ నేరగాళ్ల చేతిలో మోసపోకుండా ఎలాంటి జాగ్రత్తలు తీసుకోవాలి అనే అంశాలపై వివరించారు. కార్యక్రమంలో ఆర్బీఐ ప్రతినిధులు రాహుల్ బుర్దే, లోకేష్, యూబీఆర్ఎస్ఈటీఐ డైరెక్టర్ అమరేశ్వర్‌రెడ్డి, సిబ్బంది పాల్గొన్నారు.

ఉల్లితో అక్రమ వ్యాపారం

- రైతు బజార్లలో దళారులతో కలిసి ఈవోలు, మార్కెటింగ్ అధికారుల ఆగడాలు
- స్థానిక రైతులకు తప్పని కష్టాలు



విజయవాడ కల్చరల్, సెప్టెంబరు 12 (ఆంధ్రజ్యోతి): ఎన్టీఆర్, కృష్ణాజిల్లాలోని రైతు బజార్లలో ఉల్లిపాయలను భారీ ధరలకు అమ్ముకొని సొమ్ము చేసుకొంటున్నారని వినియోగదారులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. గొల్లపూడి హోల్‌సేల్ మార్కెట్‌లో ఏకంగా కిలో రూ.23 నుంచి 25 వరకు పలుకుతోంది. అంటే కేజీకి రూ.9 లాభంతో వినియోగదారుల జేబులకు చిల్లుపెడుతున్నారు. సోలాపూర్ నుంచి దిగుమతి చేసుకొంటున్న ఉల్లిపాయలను గొల్లపూడి మార్కెట్‌లో రూ.16కు అమ్ముతున్నారు. రైతు బజార్‌లో మార్కెటింగ్ శాఖ నియమాల ప్రకారం హోల్‌సేల్ మార్కెట్‌కి మించి రూ.2 లాభంతో మాత్రమే అమ్మాలి. కృష్ణా, ఎన్టీఆర్ జిల్లాల రైతు బజార్లలోని ఇటు ఉల్లిపాయల వ్యాపారులు అటు రైతు బజారు ఎస్టేట్ అధికారులు, మార్కెటింగ్ శాఖ అధికారులు, దళారీ వ్యవస్థను సృష్టించి అధిక ధరలను అమ్ముకొంటూ జేబులు నింపుకొంటున్నారని వారు ఆరోపిస్తున్నారు. ఎన్టీఆర్ జిల్లాలో పటమట రెండు రైతు బజార్లు 10 టన్నులు గాంధీనగర్, కేదారేశ్వరపేట రైతు బజార్‌లో 12 టన్నులు, పాయకాపురం, సింగ్‌నగర్‌లో 6 టన్నులు, భవానీపురం, కృష్ణలంక 8 టన్నులు, జగ్గయ్యపేట, కంచికచర్ల, నందిగామలో 23 టన్నులు, ఉయ్యూరు, కంకిపాడు కృష్ణాజిల్లాలో కూచిపూడి, గన్నవరం, గుడివాడ, బందరు, చల్లపల్లి రైతు బజార్‌లో 31 టన్నులు మొత్తంగా కలిసి 80 నుంచి 90 టన్నులకు పైగా రోజుకు ఉల్లిపాయల అమ్మకాలు సాగుతుంటాయి. 90 టన్నుల అమ్మకాలపై దాదాపుగా వచ్చిన రూ. 5 నుంచి 6 లక్షల లాభాలు దళారులతో పాటు ఎస్టేట్ అధికారులు కిందిస్థాయి మార్కెటింగ్ శాఖ అధికారులు పంచుకొంటున్నారని వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

స్థానిక ఉల్లి రైతులకు నష్టాలు

ఇంకోవైపు స్థానికంగా ఉల్లి పండించే రైతుల పరిస్థితి దారుణంగా ఉంది. మార్కెట్‌లో ధరలు లేక తీవ్ర నష్టాలు ఎదుర్కొంటున్న నేపథ్యంలో రైతుబజార్ వ్యాపారులు మహారాష్ట్రలోని సోలాపూర్‌లో రూ.1200 వరకు కొని దిగుమతి చేసుకోవడం విశేషం. మన రాష్ట్రంలోని కర్నూల్ జిల్లాలో ప్రస్తుతం ఉల్లి రైతులు ధరల లేక రూ.500 లేక రూ.600కే అమ్మకం చేయడానికి సిద్ధంగా ఉన్నారు. వారి వద్ద ఆ మాత్రం ధర పెట్టుకొనే వాళ్లు లేకపోవడంతో ఉల్లిపాయలను రోడ్లపైన, నదుల్లో పారవేస్తూ మార్కెటింగ్ శాఖకు నిరసన తెలుపుతున్నారు. మార్కెటింగ్ శాఖ తక్కువ ధరకే కర్నూల్ రైతు వద్ద కొని రైతుబజార్‌లో అమ్మకాలు చేయిస్తే అటు రైతులకు ఇటు వినియోగదారులకు తక్కువ ధరలో ఉల్లిపాయలు దొరికే అవకాశం ఉంటుందని కొందరు రైతులు అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు. దీనిపై దృష్టి సారించాల్సిన అవసరం ఉంది.

మంత్రి సత్యకుమార్‌కు దసరా ఉత్సవాల ఆహ్వాన పత్రిక



ఇంద్రకీలాద్రి, సెప్టెంబరు 12 (ఆంధ్రజ్యోతి): దుర్గగుడిలో ఈనెల 22 నుంచి జరగనున్న దసరా మహోత్సవాలకు రావల్సిందిగా మంత్రి సత్యకుమార్ యాదవ్‌కు శుక్రవారం వెలగపూడిలోని ఆయన కార్యాలయంలో దుర్గగుడి ఈవో వీకే శీనానాయక్, ప్రధాన అర్చకుడు లింగంబొట్ల దుర్గాప్రసాద్ దసరా మహోత్సవాల ఆహ్వాన పత్రికను అందించారు. ఈవో, ప్రధాన అర్చకుడు మంత్రికి అమ్మవారి ప్రసాదం, శేషవస్త్రం అందించగా, పురోహితులు వేదాశీర్వచనం అందజేశారు.



మంత్రి రవీంద్రకు వినతిపత్రం అందజేస్తున్న కార్యాలయ సిబ్బంది

దేవాలయ ఉద్యోగులకు పీఆర్సీ ఇవ్వాలి

- మంత్రి కొల్లు రవీంద్రకు వినతిపత్రం

మచిలీపట్నం టౌన్, సెప్టెంబరు 12 (ఆంధ్రజ్యోతి): పీఆర్సీ ఇవ్వాలని కోరుతూ మోపిదేవి సుబ్రహ్మణ్యేశ్వర స్వామి దేవస్థానం ఉద్యోగులు మంత్రి కొల్లు రవీంద్రకు వినతిపత్రం అందజేశారు. హిందూ ధార్మిక సంస్థల సిబ్బంది సంక్షేమ సంఘం సంఘ అధ్యక్షుడు గంజాల శివనాగరాజు, ఉపాధ్యక్షుడు సత్య పుష్పకుమార్, మోపిదేవి సోమశేఖర్, బోగిరెడ్డి చిన సుభాని, మోపిదేవి దుర్గా నాగేంద్రప్రసాద్, పెనుమాక రామారావు, పిళ్లారిశెట్టి వెంకట రాఘవరావు, కందుల సురేంద్రబాబు, అడుసుమిల్లి సుబ్బారావు తదితరులు మంత్రిని కలిసిని వారిలో ఉన్నారు. సింహాచలం, అన్నవరం, ద్వారకాతిరుమల, విజయవాడ దుర్గగుడి, మోపిదేవి, పెదకాకాని, కోటప్పకొండ, మంగళగిరి వంటి ప్రధాన దేవాలయాల్లో వందలాది ఉద్యోగులు కనీస వేతనాలు లేకుండా పనిచేస్తున్నారన్నారు. దేవాలయాల ఉద్యోగులకు ప్రభుత్వ ఉద్యోగులకు ఇచ్చేలా పీఆర్సీ ఎంతో అవసరమన్నారు. వార్షిక ఇంక్రిమెంట్లు, డీఏ, హెచ్‌ఆర్‌ఏ, ఐఆర్ ప్రయోజనాలు కల్పించాలన్నారు.



ఐఏఎస్ అధికారులు హిమాన్షు శుక్లా, కృతికా శుక్లా దంపతులకు అమ్మవారి చిత్రపటం అందజేస్తున్న ఈవో శీనానాయక్

దుర్గమ్మ సన్నిధిలో ఐఏఎస్ అధికారులు

ఇంద్రకీలాద్రి, సెప్టెంబరు 12 (ఆంధ్రజ్యోతి): దుర్గగుడిలో కనకదుర్గమ్మను ఐఏఎస్ అధికారులు హిమాన్షు శుక్లా, కృతికా శుక్లా శుక్రవారం దర్శించుకున్నారు. ఈవో వీకే శీనానాయక్ వారికి ఆలయ మర్యాదలతో స్వాగతం పలికి అమ్మవారి దర్శనం కల్పించారు. అనంతరం వేద పండితులు వారికి వేద ఆశీర్వచనం అందజేశారు. ఈవో వారికి అమ్మవారి చిత్రపటం, లడ్డూ ప్రసాదం, శేషవస్త్రం అందజేశారు. నెల్లూరు జిల్లా కలెక్టర్‌గా హిమాన్షు శుక్లా నియామకం కాగా, పల్నాడు కలెక్టర్‌గా కృతికా శుక్లా నియమితులయ్యారు.



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్

పేదరిక నిర్మూలనే ప్రభుత్వ ధ్యేయం

- అవనిగడ్డలో ఘనంగా స్త్రీ శక్తి విజయోత్సవ సభ

అవనిగడ్డ, సెప్టెంబరు 12 (ఆంధ్రజ్యోతి): పేదరిక నిర్మూలనే ప్రభుత్వ ధ్యేయమని ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్ అన్నారు. స్థానిక రెవెన్యూ సమావేశ మందిరంలో జిల్లా తెలుగు మహిళ కమిటీ ఆధ్వర్యంలో సూపర్ సిక్స్ - సూపర్ హిట్, స్త్రీ శక్తి విజయోత్సవ సభ శుక్రవారం జరిగింది. ముఖ్య అతిథులుగా పాల్గొన్న మండలి బుద్ధప్రసాద్ ఆర్టీసీ చైర్మన్ కొనకళ్ల నారాయణరావు మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం పేదరిక నిర్మూలనకు పీ-4, తల్లికి వందనం, స్త్రీ శక్తి పథకాలను సమర్థవంతంగా అమలు చేస్తోందన్నారు. టీడీపీ అంగన్వాడీ సంఘాల రాష్ట్ర అధ్యక్షురాలు ఆచంట సునీత, నియోజకవర్గ పరిశీలకుడు కనపర్తి శ్రీనివాసరావు, మార్కెట్ కమిటీ చైర్మన్లు కొల్లూరి వెంకటేశ్వరరావు, తోట కనకదుర్గ, జిల్లా తెలుగు మహిళా అధ్యక్షురాలు తలశిల స్వర్ణలత, కూటమి నేతలు మత్తి వెంకటేశ్వరరావు, కొండవీటి సునీత, బండే కనకదుర్గ, మోర్ల జయలక్ష్మి, పైడిపాముల కృష్ణకుమారి, అరజా సంధ్యారాణి, పైడిపాముల స్వప్న, మట్టా కోమలి, అరజా రాధిక, బచ్చు కృష్ణకుమారి పాల్గొన్నారు.

నవంబరు 8న విజయవాడలో ఇళయరాజా మ్యూజికల్ షో

విజయవాడ సిటీ, సెప్టెంబరు 12 (ఆంధ్రజ్యోతి): విజయవాడ ఇందిరాగాంధీ స్టేడియంలో మ్యాస్ట్రో ఇళయరాజా మ్యూజికల్ షోను నవంబర్ 8న నిర్వహించేందుకు ఏర్పాట్లు చేసినట్టు ట్రెండ్ సెట్టర్ ఈవెంట్స్ అధినేత సుధాకర్ తెలిపారు. ఈ మేరకు పోస్టర్‌ను మంత్రి టీజీ భరత్ శుక్రవారం ఆవిష్కరించారు. ఇళయరాజా అమరగీతాలను ప్రత్యక్షంగా ఆస్వాదించే అవకాశం విజయవాడ, ఆంధ్రా ప్రజలకు దొరికిన అపూర్వ అవకాశంగా ఈవెంట్‌ను మంత్రి అభివర్ణించారు. సంగీత అభిమానులకు ఆ రోజు గుర్తుండి పోయే అనుభవమన్నారు.

ప్రజారోగ్య పరిరక్షణకు చిత్తశుద్ధితో పనిచేస్తాం

- మంత్రి సత్యకుమార్ యాదవ్
- నందిగామలో 100 పడకల వైద్యశాల పనులకు ఎంపీ కేశినేని, ఎమ్మెల్యే సౌమ్యతో కలిసి శంకుస్థాపన



సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి సత్యకుమార్ యాదవ్

నందిగామ, సెప్టెంబరు 12 (ఆంధ్రజ్యోతి): ప్రజల ఆరోగ్య పరిరక్షణకు కూటమి ప్రభుత్వం చిత్తశుద్ధితో ముందుకు సాగుతోందని వైద్య ఆరోగ్య శాఖా మంత్రి సత్యకుమార్ యాదవ్ అన్నారు. శుక్రవారం నందిగామ పట్టణంలో వంద పడకల వైద్యశాల పనులకు ఎంపీ కేశినేని శివనాథ్, ప్రభుత్వ విప్ తంగిరాల సౌమ్యతో కలిసి ఆయన శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ గత వైసీపీ పాలకుల నిర్లక్ష్యానికి గురైన వంద పడకల వైద్యశాల కోసం సౌమ్య ఎంతో కృషి చేశారన్నారు. పనులు త్వరగా పూర్తి చేసేందుకు సహకారం అందిస్తానన్నారు. ఎంపీ కేశినేని శివనాథ్ మాట్లాడుతూ వంద పడకల వైద్యశాల నిర్మాణంతో నియోజకవర్గ ప్రజలకు ఎంతో మేలు జరుగుతుందన్నారు. సౌమ్య చిత్తశుద్ధితో పని చేయడం వల్లే ఇంత త్వరగా నందిగామకు వంద పడకల వైద్యశాల అందిందన్నారు. ప్రభుత్వ విప్ తంగిరాల సౌమ్య మాట్లాడుతూ మాజీ మంత్రి దేవినేని వెంకటరమణ కృషితో పీహెచ్‌సీ స్థాయి నుంచి ఏరియా వైద్యశాలకు అప్‌గ్రేడ్ అయిందన్నారు. ఆయన మరణానంతరం అప్పటి మాజీ మంత్రి దేవినేని ఉమామహేశ్వరరావు కృషితో సకల వసతులతో వైద్యశాల అభివృద్ధి జరిగిందన్నారు. పెరుగుతున్న జనాభాతో ఈ వైద్యశాల విస్తరణకు గత టీడీపీ ప్రభుత్వంలోనే ప్రతిపాదనలు చేయగా, ఎన్నికలు రావడంతో నిలిచిపోయిందన్నారు. అనంతరం వైసీపీ అధికారంలో వచ్చిందని, అప్పటి పాలకుల నిర్లక్ష్యాకంతో వైద్యశాల ఉనికి కోల్పోయిందన్నారు. కూటమి అధికారంలోకి రాగానే అడిగిన వెంటనే సీఎం చంద్రబాబు, మంత్రి సత్యకుమార్ యాదవ్ వంద పడకల వైద్యశాలకు నిధులు ఇచ్చారన్నారు. వైద్యశాల సాధనకు ఎంపీ కేశినేని శివనాథ్ సహకారం మరువలేనిదన్నారు. వైద్యశాల అభివృద్ధి కమిటీ చైర్మన్ వేపూరి నాగేశ్వరరావు, ఎన్ఎస్ఎల్‌బీసీ ప్రాజెక్ట్ కమిటీ చైర్మన్ కోట వీరబాబు, ఏఎంసీ చైర్మన్లు కోగంటి బాబు, పిట్టల శ్రీదేవి, నియోజకవర్గ పరిశీలకుడు బచ్చుల సుబ్రహ్మణ్యం, మునిసిపల్ చైర్‌పర్సన్ మండవ కృష్ణకుమారి, డీసీహెచ్ఎస్ మాధవీదేవి, సూపరింటెండెంట్ సత్యనారాయణ, ప్రజాప్రతినిధులు, అధికారులు పాల్గొన్నారు.



ఉత్తమ కంపెనీలకు బిజినెస్ ఎక్స్‌లెన్సు అవార్డులను ప్రదానం చేస్తున్న మంత్రులు, ఎంపీ కేశినేని చిన్ని

బిజినెస్ ఎక్స్‌లెన్స్ అవార్డుల ప్రదానం

హాజరైన మంత్రులు టీజీ భరత్, కొండపల్లి శ్రీనివాస్, కొల్లు రవీంద్ర, ఎంపీ శివనాథ్

పెనమలూరు, సెప్టెంబరు 12 (ఆంధ్రజ్యోతి): బిజినెస్ ఎక్స్‌లెన్సు-2025 అవార్డులను ఆంధ్రప్రదేశ్ చాంబర్స్ ఆఫ్ కామర్స్ అండ్ ఇండస్ట్రీ ఫెడరేషన్ (ఏపీ ఛాంబర్స్) శుక్రవారం విజయవాడ పోరంకిలోని మురళీ రిసార్ట్సులో రాష్ట్ర మంత్రుల చేతుల మీదుగా అందించింది. వైభవంగా జరిగిన ఈ అవార్డుల ప్రదానోత్సవంలో మంత్రులు టీజీ భరత్, కొండపల్లి శ్రీనివాస్, కొల్లు రవీంద్ర, ఎంపీ కేశినేని శివనాథ్, ఫుడ్ ప్రాసెసింగ్ కార్యదర్శి డాక్టర్ చిరంజీవ్ చౌదరి అతిథులుగా హాజరై విజేతలకు అవార్డులను అందజేశారు. పరిశ్రమ, ఆవిష్కరణ, సమాజాభివృద్ధికి అసాధారణమైన సేవలందించిన వివిధ రంగాల్లోని వ్యాపార సంస్థలను, పారిశ్రామికవేత్తలను గుర్తించి గౌరవించడానికి ఏపీ చాంబర్స్ ఈ బిజినెస్ ఎక్స్‌లెన్సు అవార్డులను ఏర్పాటు చేసిందని సంస్థ అధ్యక్షుడు పొట్లూరి భాస్కరరావు, ప్రధాన కార్యదర్శి బీ రాజశేఖర్, కోశాధికారి ఎస్ అక్కయ్యనాయుడు తెలిపారు. రాష్ట్ర వ్యాప్తంగా 600 మంది పారిశ్రామికవేత్తలు, ఉన్నతాధికారులు, వ్యాపారవేత్తలు హాజరయ్యారు. అవార్డుల జ్యూరీ సభ్యులుగా ఐఏఎస్ అధికారి జే సత్యనారాయణ, ప్రపంచ ఆర్థిక వేదికకు చెందిన సెంటర్ ఫర్ ది ఫోర్త్ ఇండస్ట్రియల్ రెవెల్యూషన్ ఇండియా ముఖ్య సలహాదారు, భారత విశిష్ట గుర్తింపు ప్రాధికార సంస్థ మాజీ చైర్మన్ నిమ్మగడ్డ రమేష్‌కుమార్, ఏపీ మాజీ ఎలక్షన్ కమిషనర్ అజిత్ రంగ్నేకర్, ఆర్టెసీహెచ్ డైరెక్టర్ జనరల్, ఐఎస్‌బీ హైదరాబాద్ మాజీ డీన్‌లు వ్యవహరించారు. ఈ ఏడాది ఉత్తమ స్టార్టప్ కంపెనీగా వేపూరి ఆగ్రో ప్రొడక్ట్సు ఎంపికవగా ఫ్రెష్‌బౌల్ హార్టికల్చర్ కంపెనీ, ఎప్లానిక్స్ సిస్టమ్సు కంపెనీలు ఉత్తమ ఎంఎస్ఎంఈలుగా, ఎగుమతుల్లో ఉత్తమ కంపెనీగా జ్యోతి గ్రానైట్సు ఎక్స్‌పోర్ట్సు కంపెనీ, ఉత్తమ కంపెనీ (లార్జ్)గా మా మహామాయ ఇండస్ట్రీస్, పరమేశు బయోటెక్ ఫుడ్ ప్రాసెసింగ్‌లో ఉత్తమ కంపెనీగా, మోహన్ స్పింటెక్స్ ఇండియా లిమిటెడ్ టెక్స్‌టైల్స్‌లో ఉత్తమ కంపెనీగా, ఈఏడాది ఉత్తమ మహిళా పారిశ్రామికవేత్తగా రావుస్ సెక్యూరిటీ, హౌస్ కీపింగ్ ఏజెన్సీ అధినేత పీ రమణి అవార్డులు పొందారు. శరత్ ఛటర్జీ లిమిటెడ్ కంపెనీ లాజిస్టిక్స్‌లో ఉత్తమ కంపెనీగా, ఇన్ప్రా, రియల్ ఎస్టేట్‌లో కేఎంవీ స్పేసెస్, సర్క్యులర్ ఎకానమీలో ఉత్తమ కంపెనీగా హోలోసేన్ ఎకో సొల్యూషన్స్, ఆటోమొబైల్స్‌లో ఉత్తమ కంపెనీగా అవేరా ఏఐ మొబిలిటీ, ఉత్తమ సీఎస్సార్ చొరవగా దీపక్ నెక్స్‌జెన్ ఫీడ్స్‌లు ఎంపికయ్యాయి. ఈనాడు గ్రూపు సంస్థల చైర్మన్ స్వర్గీయ రామోజీరావు జ్ఞాపకార్థం ఏర్పాటు చేసిన ప్రత్యేక జీవిత సాఫల్య పురస్కారాన్ని సీసీఎల్ ప్రోడక్ట్సు ఇండియా లిమిటెడ్ ఎగ్జిక్యూటివ్ చైర్మన్ చల్లా రాజేంద్రప్రసాద్‌కు ప్రదానం చేశారు.

నేర నియంత్రణకు పర్యావరణహిత సాంకేతికత

- సీపీటీఈడీ జాతీయ సదస్సులో 20 సూత్రాల చైర్మన్ లంకా దినకర్
- భావోద్వేగాలను నియంత్రించగలిగితే నేరాల అదుపు సాధ్యం

విజయవాడ సిటీ, సెప్టెంబరు 12 (ఆంధ్రజ్యోతి): నగరాలు, పట్టణాలు, నగర పంచాయతీల్లో జరుగుతున్న నేరాలను నియంత్రించి వికసిత్ భారత్-2047, స్వర్ణాంధ్ర-2047 లక్ష్యం సాధనకు కృషి చేయాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని 20 సూత్రాల కమిటీ రాష్ట్ర చైర్మన్ లంకా దినకర్ సూచించారు. దీనికోసం అత్యాధునిక సాంకేతికతను అందిపుచ్చుకోవాల్సిన అవశ్యకత ఉందని అభిప్రాయపడ్డారు. పట్టణ, నగరాల్లో ముందస్తు నేరాల నివారణ వాతావరణ రూపకల్పన (క్రైం ప్రివెన్షన్ త్రో ఎన్విరాన్‌మెంటల్ డిజైన్-సీపీటీఈడీ, ఏఐ ఇన్ అర్బన్ ఏరియాస్) అనే అంశంపై విజయవాడలోని స్కూల్ ఆఫ్ ప్లానింగ్ అండ్ ఆర్కిటెక్చర్ (ఎస్‌పీఏ) కాలేజీలో శుక్రవారం జరిగిన జాతీయ సదస్సుకు ఆయన ముఖ్య అతిథిగా హాజరై ప్రసంగించారు. దురలవాట్లకు బానిసైనవారు, తీవ్ర భావోద్వేగానికి గురైన వ్యక్తులు నేరాలు చేస్తారని, ఏ సమయంలో ఎలాంటి నేరం చేస్తారో గుర్తించడం కష్టమన్నారు. ఇలాంటి వ్యక్తులను గుర్తించేందుకు సాంకేతిక సాయం అవసరమన్నారు. రాష్ట్రంలోని 6 కోట్ల జనాభాలో సుమారు 35శాతం మంది 17నగరాలు, 78 పట్టణాలు, 31 నగర పంచాయతీల్లో నివసిస్తున్నారన్నారు. పూర్తిస్థాయి నేరాల నియంత్రణకు సీపీటీఈడీ జాతీయ వర్క్‌షాప్ నిర్వహించిన ఎస్‌పీఏ కాలేజీ యాజమాన్యాన్ని అభినందించారు. ఇప్పటికే పేషియల్ రికగ్నేషన్, సీసీ కెమెరాలు, బయోమెట్రిక్ సాధనాలను ఉపయోగిస్తున్నామన్నారు. నేరస్థులు సైతం ఆధునిక సాంకేతికతను అందిపుచ్చుకుంటూ పోలీస్ శాఖకు సవాల్ విసురుతున్నారన్నారు. దీనికి చెక్ పెట్టేందుకు ఏఐ టెక్నాలజీని ఉపయోగించుకుని మరింత సమర్థవంతమైన టూల్స్‌ను రూపొందించాలన్నారు. దీనికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సాంకేతిక సాధనాలను సమకూర్చాలన్నారు. సీపీటీఈడీ వర్క్‌షాప్‌లో వెల్లడైన వివరాలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తానని వివరించారు. డీసీపీ కేజీవీ సరిత, ఎస్‌పీఏ విజయవాడ డైరెక్టర్ రమేష్, ప్రొఫెసర్ వీరేంద్రకుమార్ పాల్, ఐబీఎం శాస్త్రవేత్త రవికుమార్‌రెడ్డి, డీపీ శ్రీనివాస్ పాల్గొన్నారు.



సభలో ప్రసంగిస్తున్న 20 సూత్రాల చైర్మన్ లంకా దినకర్

చేనేత సమస్యలు పరిష్కరించాలి

- రాష్ట్ర చేనేత కార్మిక సంఘం ప్రధాన కార్యదర్శి పిల్లలమర్రి



సమావేశంలో మాట్లాడుతున్న పిల్లలమర్రి, చిత్రంలో కేవీవీ ప్రసాద్ తదితరులు

చల్లపల్లి, సెప్టెంబరు 12 (ఆంధ్రజ్యోతి): చేనేత కార్మికులకు బంగారు భవిష్యత్తును ఇస్తానని ఎన్నికల్లో వాగ్దానాలు చేసి అధికారంలోకి వచ్చిన కూటమి ప్రభుత్వం చేనేత కార్మికుల సమస్యలు పరిష్కరించకుంటే రాష్ట్రవ్యాప్తంగా ఆందోళనకు సిద్ధమని ఆంధ్రప్రదేశ్ చేనేత కార్మికసంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పిల్లలమర్రి నాగేశ్వరరావు అన్నారు. పోరుబాట సాగిద్దాం - చేనేత పరిశ్రమను రక్షించుకుందాం పేరుతో పెడనలో ప్రారంభమైన చేనేత అధ్యయన యాత్ర శుక్రవారం రాత్రికి చల్లపల్లి చేరింది. ఈ సందర్భంగా చంద్ర రాజేశ్వరరావు వికాసకేంద్రంలో జరిగిన విలేకర్ల సమావేశంలో నాగేశ్వరరావు మాట్లాడుతూ పదేళ్లలో చేనేత సహకార సంఘాలకు ప్రభుత్వం రూ.127.87 కోట్లు బకాయిలున్నట్టు తెలిపారు. చేనేత సంఘాలకు ఎన్నికలు నిర్వహించకుండా పాలకవర్గాలను నిర్వీర్యం చేసి సంఘాలను పాతాళంలోకి తొక్కారని వాపోయారు. ప్రభుత్వం స్పందించకుంటే విజయవాడలో పెద్దఎత్తున ఆందోళన చేపట్టేందుకు కార్యాచరణ ప్రకటిస్తామని స్పష్టంచేశారు. సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కేవీవీ ప్రసాద్ మాట్లాడుతూ ఈ చేనేత అధ్యయన యాత్రలో చేనేత కార్మికులను కలుస్తున్నామనీ, ప్రతి చేనేత కుటుంబం నుంచీ ముఖ్యమంత్రికి విజ్ఞానపత్రం పేరుతో సంతకాలతో కూడిన మెమోరాండం అందించే ఆలోచన చేస్తున్నట్టు తెలిపారు. పెడనలో ప్రారంభమైన ఈ యాత్ర కప్పలదొడ్డి, పోలవరం, కాజ, ఘంటసాల, చల్లపల్లిలో సాగింది. చేనేత కార్మికసంఘం రాష్ట్ర అధ్యక్షుడు బీ మాధవస్వామి, మాజీ అధ్యక్షుడు కట్టా హేమసుందరరావు, రాష్ట్ర ఉపాధ్యక్షుడు యక్కల పీతాంబరరావు, రాష్ట్ర సహాయ కార్యదర్శి గొట్టుముక్కల బాలాజీ, జిల్లా అధ్యక్షుడు కోదాటి నారాయణరావు, సీపీఐ జిల్లా సహాయ కార్యదర్శి అడ్డాడ ప్రసాద్‌బాబు, యాత్ర టీమ్‌లీడర్ విజయకుమార్ పాల్గొన్నారు.

యాత్రలో భాగస్వాములవండి

ఘంటసాల: చేనేత అధ్యయన యాత్రలో భాగస్వాములు కావాలని చేనేత సంఘం రాష్ట్ర కార్యదర్శి పిల్లలమర్రి నాగేశ్వరరావు పిలుపునిచ్చారు. చేనేత సహకార సంఘాల, సహకారేతర కార్మికుల ఉపాధికి ఏపీ చేనేత కార్మిక సంఘం రాష్ట్ర సమితి ఆధ్వర్యంలో చేపట్టిన చేనేత అధ్యయన యాత్ర శుక్రవారం ఘంటసాలకు చేరింది. రాష్ట్ర చేనేత కార్మిక సంఘ నేతలు అందె జగదీష్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన సమావేశంలో నాగేశ్వరరావు మాట్లాడుతూ రాష్ట్రవ్యాప్తంగా ఉన్న చేనేత ప్రదేశాలను పర్యటించి వారి సమస్యలను అధ్యయనం చేసి ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లేందుకు ఈ యాత్రను చేపట్టామన్నారు. చేనేత సహకార సంఘాలకు పాలకవర్గ ఎన్నికలు నిర్వహించాలని డిమాండ్ చేశారు. నేతలు కేవీవీ ప్రసాద్, బీ మాధవస్వామి, కట్టా హేమ సుందర్‌రావు, బాలాజీ, యక్కల పీతాంబరరావు, కోదాటి నారాయణరావు, కోదాటి నాగయ్య, విజయ్ కుమార్ పాల్గొన్నారు.

14న కబడ్డీ బాలబాలికల జట్ల ఎంపికలు

లబ్బీపేట, సెప్టెంబరు 12 (ఆంధ్రజ్యోతి): ఎన్టీఆర్ జిల్లా కబడ్డీ జూనియర్ బాలుర, బాలికల జిల్లా జట్టు సెలక్షన్స్ 14న ఆదివారం నిర్వహిస్తున్నట్టు ఆర్గనైజింగ్ సెక్రెటరీ టీ సుధాకర్ తెలిపారు. ఈ ఎంపికలు రైల్వే స్టేడియంలో మధ్యాహ్నం 3 గంటల నుంచి జరుగుతాయని, పాల్గొనే క్రీడాకారులు 20ఏళ్ల లోబడి ఉండాలన్నారు. బాలుర వి భాగంలో 75 కేజీలు, బాలికల విభాగంలో 65 కేజీలు లోపుండాలని, అలాగే మ్యాట్ షూ, ఆధార్ కార్డు ఒరిజనల్ తప్పనిసరిగా తీసుకువెళ్లాలన్నారు. ఎంపికైన క్రీడాకారులు గొల్లపూడిలో ఈ నెల 25 నుంచి 28 వరకు జరిగే పోటీల్లో పాల్గొంటారని, ఇతర వివరాలకు ఫోన్ నెంబర్స్ 7702959293, 9491960547 నందు సంప్రదించాలని తెలిపారు.

వెలుగు కంప్యూటర్ ఆపరేటర్ ఆత్మహత్యాయత్నం

- నిందలు మోపడమే కారణం..!
- అధికార పార్టీ నేత ఒత్తిడితో బలవంతపు రాజీనామా..!

గుడివాడ, సెప్టెంబరు 12 (ఆంధ్రజ్యోతి): వెలుగు ప్రాజెక్టులో అవుట్ సోర్సింగ్ ఉద్యోగిగా పనిచేస్తున్న కంప్యూటర్ ఆపరేటర్ కమ్ అకౌంటెంట్ బంకుర సీతామహాలక్ష్మి తనపై లేనిపోని నిందలు మోపారంటూ శుక్రవారం ఆత్మహత్యకు ప్రయత్నించింది. వివరాల్లోకి వెళితే స్థానిక వెలుగు ప్రాజెక్టులో 2014లో బంకుర సీతామహాలక్ష్మి అవుట్ సోర్సింగ్ ఉద్యోగిగా విధుల్లో చేరింది. 11 ఏళ్లుగా కంప్యూటర్ ఆపరేటర్ కం అకౌంటెంట్‌గా విధులు నిర్వర్తిస్తున్నారు. ఇటీవల సీతామహాలక్ష్మి కార్యాలయంలోని ఓ ఉన్నతోద్యోగితో వివాహేతర సంబంధం ఉందని చెబుతూ దుష్ప్రచారం జరిగింది. అన్నాచెల్లెళ్లలా ఉండే తమ మధ్య వివాహేతర సంబంధం పుకార్లు పుట్టించారని, సీసీ జ్యోతి, మరికొందరు ఉద్యోగులు తనపై గుడివాడ మండలానికి చెందిన అధికార పార్టీ నేతకు లేనిపోనివి కల్పించి చెప్పారని బాధితురాలు ఆరోపిస్తున్నారు. గురువారం అధికార పార్టీ నేత ఒకరు వెలుగు కార్యాలయానికి ఫోన్ చేసి వెంటనే ఉద్యోగానికి రాజీనామా చేయాలని, లేకుంటే పరిణామాలు తీవ్రంగా ఉంటాయని హెచ్చరించారని పేర్కొన్నారు. ఒక్క పక్క వ్యక్తిత్వ హననం, మరోపక్క రాజకీయ నేత ఒత్తిడి తట్టుకోలేక భయభ్రాంతులకు గురై రాజీనామా సమర్పించినట్టు సీతామహాలక్ష్మి తెలిపారు. బాధితురాలి భర్త జగన్నాథం మాట్లాడుతూ తన భార్య సీతామహాలక్ష్మికి ఉన్నత ఉద్యోగితో వివాహేతర సంబంధం అంటకడుతూ విష ప్రచారం చేశారని, అధికార పార్టీ నేతతో బెదిరించి రాజీనామా చేయించడంతో అవమానం తట్టుకోలేక ఇంట్లో ఎవరూ లేని సమయంలో శుక్రవారం పురుగు మందు తాగి ఆత్మహత్యకు పాల్పడిందన్నారు. ఈ మేరకు ఆత్మహత్యకు యత్నించిన సీతామహాలక్ష్మిని ఆమె భర్త జగన్నాథం చికిత్స నిమిత్తం స్థానిక ఏరియా ప్రభుత్వాసుపత్రికి తరలించారు. ప్రస్తుతం ఆరోగ్యం నిలకడగా ఉన్నట్టు సమాచారం. వెలుగు కార్యాలయం అసిస్టెంట్ ప్రాజెక్టు మేనేజర్ ప్రసాద్ మాట్లాడుతూ ఇటీవల సీతామహాలక్ష్మి వ్యక్తిత్వ హననం చేస్తూ కార్యాలయంలో దుష్ప్రచారం జరిగిందని, దీన్ని ఖండించినట్లు పేర్కొన్నారు. ఆమె ఆత్మహత్యకు ఎందుకు పాల్పడిందో తెలియదని, తెలిసిన వెంటనే ఆసుపత్రికి వెళ్లి పరామర్శించినట్టు ఆయన తెలిపారు. సీసీ జ్యోతి మాట్లాడుతూ కార్యాలయంలో ఉన్నతాధికారి, సీతామహాలక్ష్మి మధ్య అక్రమ సంబంధం ఉన్నట్టు ప్రచారం జరుగలేదని, ఏనాడు ఆ దృష్టితో కార్యాలయంలో వారివురిని ఎవరూ చూడలేదని వెలుగు సీసీ జ్యోతి పేర్కొన్నారు. స్వంత దస్తూరితోనే సీతామహాలక్ష్మి రాజీనామా సమర్పించిందని, ఆత్మహత్యాయత్నానికి ఎందుకు పాల్పడిందో తెలియదన్నారు.

బ్రాయిలర్ ధరలు



అమరావతి	(రూ.లలో)
బ్రాయిలర్ బర్డ్	140 , 149, 160
చికెన్ విత్ స్కిన్	268
చికెన్ స్కిన్‌లెస్	278

నెక్ కోడిగుడ్డు ధర (100)
విజయవాడ జోన్ రైతు ధర రూ. 545

బాస్కెట్‌బాల్ పోటీల్లో మాంటిస్సోరి విద్యార్థి ప్రతిభ

గుడివాడ, సెప్టెంబరు 12(ఆంధ్రజ్యోతి) : రాష్ట్ర బాస్కెట్‌బాల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో చిత్తూరు, పీఈఎస్ పబ్లిక్ స్కూల్‌లో నిర్వహించిన 10వ సబ్‌జూనియర్ అంతర్ రాష్ట్ర పోటీల్లో గుడివాడ మాంటిస్సోరి ఇంగ్లీషు మీడియం ఉన్నత పాఠశాలలకు చెందిన గూడవల్లి రాకేష్ వీరమాధవ్ ప్రతిభ కనబరిచాడు. అక్టోబరు 4 నుంచి 10వ తేదీ వరకు డెహ్రాడూన్‌లో జరిగే 50వ సబ్‌జూనియర్ జాతీయ బాస్కెట్‌బాల్ పోటీల్లో పాల్గొనే రాష్ట్ర జట్టుకు ఎంపికైనట్టు పాఠశాల ప్రిన్సిపాల్ జి.పద్మావతి తెలిపారు. శుక్రవారం స్థానిక పాఠశాల ఆవరణలో విద్యార్థి మాధవ్‌ను అభినందించారు. వ్యాయామోపాధ్యాయులు జి.శ్రీనివాస్, యమ్.సత్య అన్వేష్, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.



మాధవ్‌ను అభినందిస్తున్న ఉపాధ్యాయులు

ఆటోనగర్‌కు పూర్వవైభవం తీసుకొస్తా

● ఎమ్మెల్యే వెనిగండ్ల రాము

గుడివాడ, సెప్టెంబరు 12(ఆంధ్రజ్యోతి) : ఇంజనీరింగ్ ఉత్పత్తుల ఆవిష్కరణకు నిలయమైన ఆటోనగర్‌కు పూర్వవైభవం తీసుకువస్తానని, రానున్న రోజుల్లో మరిన్ని ఆవిష్కరణల జరిగేలా కృషి చేస్తానని ఎమ్మెల్యే వెనిగండ్ల రాము పేర్కొన్నారు. శుక్రవారం స్థానిక ఆటోనగర్‌లోని శ్రీశ్రీనివాసా ఆటో ఇంజనీరింగ్ వర్క్స్ ప్రాంగణంలో నుగలాపు జయలక్ష్మీ చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో ద్వారకా తిరుమల దేవస్థానానికి రూ.2.10లక్షలు విలువ గల ట్యాంకర్ ట్రైలర్‌ను దేవస్థాన ఎగ్జికూటివ్ ఇంజనీరుకు ఎమ్మెల్యే వెనిగండ్ల చేతులు మీదగా అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత పాలకుల నిర్లక్ష్యం కారణంగా సమస్యల వలయంలో ఆటోనగర్ మునిగిపోయి, అభివృద్ధికి ఆమడ దూరంలో నిలిచిందన్నారు. ఈ కార్యక్రమంలో ఎన్టీఆర్ స్టేడియం కమిటీ ఉపాధ్యక్షుడు యలవర్తి శ్రీనివాసరావు, అర్బన్ బ్యాంకు మాజీ చైర్మన్ పిన్నమనేని బాబ్జీ, జనసేన ఇన్‌చార్జ్ బూరగడ్డ శ్రీకాంత్, ట్రస్టు చైర్మన్ నుగలాపు వెంకటేశ్వరరావు, ట్రస్టు కన్వీనర్ నుగలాపు సురేష్‌బాబు, టీడీపీ నాయకులు సత్యనారాయణ, జగన్మోహనరావు, నిమ్మగడ్డ సత్యసాయి, దుర్గారావు, స్మాల్ స్కేల్ ఇండస్ట్రీస్ ప్రతినిధులు,దేవస్థాన ప్రతినిధులు, తదితరులు పాల్గొన్నారు.

గుడివాడ : నియోజకవర్గ పరిధిలోని ప్రజా సమస్యల పరిష్కారానికి ప్రత్యేక శ్రద్ధతో కృషి చేస్తున్నట్లు ఎమ్మెల్యే వెనిగండ్ల రాము అన్నారు. శుక్రవారం స్థానిక రాజేంద్రనగర్‌లోని ఆయన స్వగృహంలో ప్రజల నుంచి అర్జీలను స్వీకరించారు. ప్రజల అర్జీలను పరిశీలించి, సంబంధిత శాఖల అధికారులకు తక్షణ పరిష్కారం చేయాలని కోరారు. ఈ సందర్భంగా ఆయన తన దృష్టికి వచ్చిన ప్రజాసమస్యలను త్వరితగతిన పరిష్కరించేందుకు కృషి చేస్తున్నానన్నారు. ఈ కార్యక్రమంలో జనసేన ఇన్‌చార్జ్ బూరగడ్డ శ్రీకాంత్, టీడీపీ నాయకులు జగన్మోహనరావు తదితరులు పాల్గొన్నారు.



వాటర్ ట్యాంకర్‌ను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే వెనిగండ్ల



చౌటపల్లిలో స్వమిత్వ సర్వేలో పాల్గొన్న అధికారులు

చౌటపల్లిలో స్వమిత్వ సర్వే

గుడివాడ రూరల్, సెప్టెంబరు 12 (ఆంధ్రజ్యోతి): చౌటపల్లిలో స్వమిత్వ సర్వే ఇంటింటికి తిరిగి నిర్వహిస్తున్నట్లు డిప్యూటీ ఎంపీడీవో జి.శ్రీనివాస్ అన్నారు. శుక్రవారం చౌటపల్లిలో డిప్యూటీ ఎంపీడీవో సర్వే జరుగుతున్న పనులు పరిశీలించారు. కార్యదర్శి హరికృష్ణతో కలసి ఇంజనీరింగ్ సిబ్బంది, అసిస్టెంట్లతో మాట్లాడారు. యంత్ర పరికరాలతో కొలతలు ఏ విధంగా వేస్తున్నది దగ్గరుండి పరిశీలించారు. ప్రజల నుంచి ఎటువంటి ఇబ్బందులు లేకుండా సర్వే చేయాలని కోరారు. ఇంటి యజమానితో కలసి వివరాలు నమోదు చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో కార్యదర్శి జి.శ్రీనివాసరావు, సిబ్బంది పాల్గొన్నారు.



ముట్టడి కార్యక్రమ వాల్‌పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న భవన నిర్మాణ కార్మిక సంఘ సభ్యులు

లేబర్ కమిషనర్ కార్యాలయ ముట్టడి 15న

గుడివాడ, సెప్టెంబరు 12(ఆంధ్రజ్యోతి) : భవన నిర్మాణ కార్మిక సంక్షేమ పథకాలను అమలు చేయాలని కోరుతూ ఈ నెల 15వ తేదీన చేపట్టిన రాష్ట్ర లేబర్ కమిషనర్ కార్యాలయ ముట్టడిని జయప్రదం చేయాలని సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు రేపాని కొండ పిలుపునిచ్చారు. శుక్రవారం స్థానిక సుందరయ్యభవన్‌లో లేబర్ కమిషనర్ కార్యాలయ ముట్టడికి సంబంధించిన వాల్‌పోస్టర్లను ఆయన ఆవిష్కరించారు. విశ్వకళా భవన్ అధ్యక్షుడు కోరం రాజు, కార్పెంటర్ యూనియన్ కార్యదర్శి ప్రభుదాసు, ప్రైవేట్ ఎలక్ట్రికల్ యూనియన్ అధ్యక్షుడు డాల్ఫిన్, బండి శ్రీను, సెంట్రింగ్ వర్కర్స్ యూనియన్ ఉపాధ్యక్షుడు మూడెడ్ల నారాయణ పాల్గొన్నారు.

పేదలకు వరం సీఎంఆర్‌ఎఫ్

● ఎమ్మెల్యే వర్ల కుమార్ రాజా

పామర్రు, సెప్టెంబరు 12 (ఆంధ్రజ్యోతి): సీఎంఆర్‌ఎఫ్ పేదలకు ఓ వరమని, ఎన్నికల హామీలను తూచా తప్పకుండా కూటమి ప్రభుత్వం అమలు చేస్తోందని ఎమ్మెల్యే వర్ల కుమార్‌రాజా అన్నారు. కొండిపర్రు, బల్లిపర్రు, పెదమద్దాలి, జమీగొల్వేపల్లి, ఐనంపూడిగ్రామాల్లో అనారోగ్యంతో ఇబ్బందులెదుర్కొంటున్న ఏడుగురు లబ్ధిదారులకు ముఖ్యమంత్రి సహాయనిధి నుంచి మంజూరైన రూ. 2,68,018 విలువగల బ్యాంకు చెక్కులను శుక్రవారం వారి ఇళ్లకు వెళ్లి అందజేశారు. ఈ సందర్భంగా వర్ల మాట్లాడుతూ రాష్ట్రం ఎన్నో ఆర్థిక ఇబ్బందుల్లో ఉన్నప్పటికీ ప్రజలకిచ్చిన సూపర్‌సిక్స్ పథకాలు విజయపథంలో దూసుకుపోయేలా అమలు చేస్తున్న ఘనత సీఎం చంద్రబాబుదేనన్నారు. కార్యక్రమంలో జనసేన ఇన్‌చార్జి తాడిశెట్టి నరేష్, టీడీపీ మండల అధ్యక్షుడు కుదరవల్లి ప్రవీణ్‌చంద్ర, కృష్ణాడెల్టాప్రాజెక్టు కమిటీ వైస్ చైర్మన్ వల్లూరిపల్లి గణేష్, ఏఎంసీ చైర్మన్ జన్నుశోభనబాబు, అయాగ్రామాల టీడీపీ నాయకులు పాల్గొన్నారు.



లబ్ధిదారులకు చెక్కులను అందిస్తున్న ఎమ్మెల్యే కుమార్‌రాజా

ఏఐ ఆధారిత సేవలపై అవగాహన తప్పనిసరి

● వి.సందీప్, జి.ప్రభాకర్

గుడివాడ, సెప్టెంబరు 12(ఆంధ్రజ్యోతి) : మారుతున్న కాలానికి అనుగుణంగా ఆదాయపు పన్ను శాఖలో ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ ఆధారిత అధునాతన సేవలు అందుబాటులోకి తీసుకువచ్చినట్టు చీఫ్ ఇన్‌కం ట్యాక్స్ అధికారులు వి.సందీప్, జి.ప్రభాకర్‌లు తెలిపారు. శుక్రవారం స్థానిక ఇన్‌కం ట్యాక్స్ కార్యాలయంలో ఆదాయపు పన్ను శాఖలో డిజిటల్ కార్యక్రమాలు అనే అంశంపై ట్యాక్స్ ప్రాక్టీషనర్‌లకు అవగాహన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఇన్‌కం ట్యాక్స్ ప్రాక్టీషనర్లు, అక్కౌంటెంట్లు డిజిటల్ విధానాలపై పూర్తి అవగాహన కలిగి ఉండాలన్నారు. ప్రధానంగా పాన్, ఆధార్ లింకింగ్, రిటర్నుల ఈ-వెరిఫికేషన్, ఫేస్లెస్ అసెస్మెంట్, అప్పీల్ వ్యవస్థలపై పన్ను చెల్లింపుదారులకు అవగాహన కల్పించాలన్నారు. ఈ సందర్భంగా పన్ను ఎగవేత, తప్పుడు క్లయిమ్‌లను గుర్తించడానికి ఆదాయపు పన్ను శాఖ ప్రవేశపెట్టిన ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్, డేటా ఎనాలిస్ సాంకేతిక పరిజ్ఞానాన్ని ఉపయోగించే విధానాలను తెలిపారు.



సమావేశంలో మాట్లాడుతున్న చీఫ్ ఇన్‌కం ట్యాక్స్ అధికారులు

ఘనంగా జాతీయ భాషా దినోత్సవం

గుడ్లవల్లేరు : పెంజంద్ర జిల్లాపరిషత్ హైస్కూల్‌లో శుక్రవారం జాతీయ భాషా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. 1949 సెప్టెంబరు 14న రాజ్యాంగ పరిషత్ హిందీని జాతీయ భాషగా గుర్తించి ఆనాటి నుంచి సెప్టెంబరు 14న హిందీ దివస్‌గా నిర్వహించుకొంటున్నామని పాఠశాల హిందీ ఉపాధ్యాయిని రత్నకుమారి అన్నారు. హిందీ దివస్‌ను పురస్కరించుకొని నిర్వహించిన వివిధ పోటీల్లో విజేతలకు బహుమతులు ప్రదానం చేశారు. ప్రధానోపాధ్యాయిని కె.మహాలక్ష్మి, ఉపాధ్యాయులు శ్రీనాథ్, నాగబాబు, వాసవి,సలీమ, అంజనేయరాజు, రాంబాబు తదితరులు పాల్గొన్నారు.

రక్తదానంతో మరొకరి ప్రాణాలు కాపాడొచ్చు

● తహసీల్దార్ గురుమూర్తి

నందివాడ, సెప్టెంబరు 12 (ఆంధ్రజ్యోతి): రక్తదానంతో మరొకరి ప్రాణాలు కాపాడొచ్చని తహసీల్దార్ గురుమూర్తి పేర్కొన్నారు. శుక్రవారం స్థానిక నందివాడ జిల్లా పరిషత్ పాఠశాలలో తహసీల్దార్ ఆధ్వర్యంలో ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ వారి సహకారంతో రక్తదాన శిబిరం ఏర్పాటు చేశారు. ముఖ్యఅతిథులుగా గుడివాడ మార్కెట్ యార్డు చైర్మన్ చాట్రగడ్డ రవి, జనసేన నాయకులు చంద్రశేఖర్ రెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా చాట్రగడ్డ రవి మాట్లాడుతూ రక్తదాన శిబిరాల ద్వారా సేకరించిన రక్తాన్ని పట్టాభి రెడ్‌క్రాస్ బ్లడ్ బ్యాంక్ ద్వారా ప్రభుత్వ ఆసుపత్రులకు తలసేన, కేన్సర్ రోగులకు ఉచితంగా అందజేయనున్నామన్నారు. ఈ రక్తదాన శిబిరానికి సుమారు 45 మంది పాల్గొన్నట్లు తహసీల్దార్ తెలిపారు. జిల్లా రెడ్‌క్రాస్ సెక్రటరీ శంకర్ నాథ్ ఇస్సాకు, ఎంఈవో శ్రీనివాస్, డేవిడ్ రత్నరాజు, డీటీ కిషోర్, ఏయమ్‌సీ చైర్మన్ కృష్ణవేణి, రాధాకృష్ణ, ఆర్‌ఐ గణేష్, సీరయ్య, సురేష్, విద్యార్థిని, విద్యార్థులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు. ఈ రక్తదాన కార్యక్రమం డాక్టర్ హనుమంతయ్య బృందంచే నిర్వహించారు.



రక్తదానం చేస్తున్న తహసీల్దార్ గురుమూర్తి రెడ్డి

పెండింగ్ డీఏలను విడుదల చేయాలి

● ఏపీటీఎఫ్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు రామారావు

కూచిపూడి, సెప్టెంబరు 12 (ఆంధ్రజ్యోతి): ఉపాధ్యాయుల పెండింగ్ డీఏలను విడుదల చేయాలని ఏపీటీఎఫ్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఈవీ రామారావు డిమాండ్ చేశారు. అపరిష్కృతంగా ఉన్న ఉపాధ్యాయుల సమస్యలను వెంటనే పరిష్కరించాలని కోరుతూ ఏపీటీఎఫ్ ఆధ్వర్యంలో మొవ్వ తహసీల్దార్ కార్యాలయం ఎదుట ఉపాధ్యాయ సంఘాల నేతలు శుక్రవారం నిరసన వ్యక్తం చేశారు. సీపీఎస్ రద్దుచేసి, ఉపాధ్యాయులను బోధనకే పరిమితం చేయాలని, ఐఆర్ వెంటనే ప్రకటించాలన్నారు. 12వ పీఆర్‌సీ కమిషన్ నియమించాలని, అన్ని రకాల పెండింగ్ బకాయిలు వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా తహసీల్దార్ మస్తాన్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయ సంఘాల నేతలు బి.కిశోర్ బాబు, డి.మాణిక్యాలరావు, ఎండి.ఇంతియాజ్, ఎల్.శ్రీనివాసరావు, జె.కవిత, నాంచారయ్య, జి.వెంకటేశ్వరరావు , ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



మొవ్వ తహసీల్దార్ కార్యాలయం ఎదుట నిరసన తెలుపుతున్న ఉపాధ్యాయులు



కాజలో పర్యటిస్తున్న చేనేత అధ్యయన బృందం

బకాయిలు విడుదల చేయాలి

కూచిపూడి, సెప్టెంబరు 12 (ఆంధ్రజ్యోతి): చేనేత సహకార సంఘాలకు రాష్ట్ర ప్రభుత్వం చెల్లించాల్సిన బకాయిలు వెంటనే విడుదల చేయాలని సంఘ రాష్ట్ర అధ్యక్షుడు బుడిగి మాధవస్వామి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. చేనేత అధ్యయన యాత్రలో భాగంగా కాజలో అధ్యయన బృందం పర్యటించి చేనేత కార్మికుల సమస్యలను చర్చించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మగ్గం ఉన్న ప్రతీ కార్మికుడికి నేతన్న భరోసా కింద సంవత్సరానికి రూ.36 వేలు చెల్లించాలని డిమాండ్ చేశారు. చేనేత కార్మికుల సమస్యలన్నింటినీ ప్రభుత్వం సానుకూలంగా స్పందించి పరిష్కరించాలని కోరారు. రాష్ట్ర కార్యదర్శి పిల్లిమర్రి నాగేశ్వరరావు, సంఘ నేతలు కొదాటి నారాయణరావు, యక్కల పీతాంబరరావు, గొట్టిముక్కల బాలాజీ, కెవివి. ప్రసాద్, కట్టా హేమసుందరరావు, చెరకు శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

ఏఎన్‌ఆర్‌లో బిజినెస్ మానిటరింగ్ పై అవగాహన

గుడివాడ : స్థానిక అక్కినేని నాగేశ్వరరావు కళాశాలలో ఎంబీఏ డిపార్టుమెంట్ ఆధ్వర్యంలో శుక్రవారం ఎక్సెల్ పవర్ బీఐతో రియల్ టైమ్ డాష్‌బోర్డులపై డైనమిక్ బిజినెస్ మానిటరింగ్‌పై ఓరియంటేషన్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిధిగా విచ్చేసిన విజయవాడ, పీబీ సిద్ధార్థ ఆర్ట్స్ అండ్ సైన్సు కళాశాల ప్రొఫెసర్ డాక్టర్ గురుప్రసాద్ మాట్లాడుతూ ప్రస్తుత కాలంలో వ్యాపార విశ్లేషణలు, పవర్ బీఐ, ప్రతి ఒక్క మేనేజ్‌మెంట్ విద్యార్థి నేర్చుకోవాలన్నారు. డీ మార్ట్, రిలయన్స్, అమెజాన్, ఫ్లిప్‌కార్టుల గురించి వివరించారు. ఈ కార్యక్రమంలో కళాశాల పాలకవర్గ అధ్యక్ష, కార్యదర్శులు ఎల్‌ఆర్‌కే ప్రసాద్, కెఎస్ అప్పారావు, ప్రిన్సిపాల్ డాక్టర్ పీజేఎస్ కుమార్, వైస్ ప్రిన్సిపాల్ బీఎస్ఎస్ పద్మజ, ఎంబీఏ విభాగాధిపతి డాక్టర్ సువర్చల, అధ్యాపకులు, పాల్గొన్నారు.

అంబేడ్కర్ విగ్రహం ఏర్పాటు

గుడివాడ : భారతరత్న డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విగ్రహాన్ని గుడివాడ నడిబొడ్డులో నెలకొల్పడం ఎంతో సంతోషకరమని ఎమ్మెల్యే వెనిగండ్ల రాము పేర్కొన్నారు. శుక్రవారం స్థానిక నాగవరప్పాడు నుంచి నెహ్రూచౌక్ సెంటర్ వరకు డాక్టర్ అంబేడ్కర్ కాంస్య విగ్రహాన్ని జై భీమ్ వెల్ఫేర్ సొసైటీ, అంబేడ్కర్ అభిమానులు భారీ ర్యాలీగా తీసుకువచ్చారు. వాహనంపై ఉన్న నూతన కాంస్య విగ్రహానికి ఎమ్మెల్యే వెనిగండ్ల పూలమాలలతో నివాళులర్పించారు.

అన్నసమారాధన రేపు

గుడివాడ: స్థానిక విఘ్నేశ్వరస్వామి దేవస్థానంలో గణపతి నవరాత్రి మహోత్సవాలను ఘనంగా నిర్వహించారు. ఈ నెల 14వతేదీ ఆదివారం దేవస్థానం ఆధ్వర్యంలో మహా అన్నసమారాధన నిర్వహించనున్నామని దేవస్థాన కమిటీ చైర్మన్ సాయన రాజేష్ తెలిపారు. ఈ కార్యక్రమంలో సభ్యులు పంచుమర్తి శ్రీనివాసరావు, శైలజ, రమణమూర్తి, పోతురాజు, విజయలక్ష్మీ, శారద, దుర్గభవాని తదితరులు పాల్గొన్నారు.

ఆధునిక సాంకేతిక , పరిశోధనాత్మకతపై మక్కువ అవసరం

● ఐసీడీఎస్ సూపర్‌వైజర్ విజయకుమారి

పామర్రు,సెప్టెంబరు12(ఆంధ్రజ్యోతి): బాల్యదశనుంచే బాలికలు ఆధునిక సాంకేతిక , పరిశోధనాత్మకత పట్ల మక్కువ పెంచుకోవాలని పామర్రు ఐసీడీఎస్ సూపర్‌వైజర్ విజయకుమారి అన్నారు. మండల పరిధిలోని కనుమూరు అంగన్వాడీ -2సెంటర్‌లో శుక్రవారం అంగన్వాడీ కేంద్ర టీచర్ కె. ప్రసన్న అధ్యక్షతన బాలికలకు ఎస్‌టీఈఎంపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ సమాజాభివృద్ధిలో బాలికల భాగస్వామ్యం కీలకంగా మారిందన్నారు. అంగన్వాడీ కేంద్రాల ద్వారా ప్రభుత్వం అందిస్తున్న పథకాలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. అంగన్వాడీ కేంద్రాల నిర్వహకులు పెదమద్దాలి అరుణ, చిన్నారుల తల్లులు, పాల్గొన్నారు.



బాలికలకు సాంకేతిక విద్యపై అవగాహన కల్పిస్తున్న విజయకుమారి

విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించాలి

● ఎంఈవో-1 సీహెచ్.రజని

గుడివాడ రూరల్, సెప్టెంబరు 12 (ఆంధ్రజ్యోతి): ప్రతీ విద్యార్థికి అర్థమయ్యే విధంగా నాణ్యమైన విద్యను బోధించాలని ఎంఈవో-1 సీహెచ్.రజని పేర్కొన్నారు. శుక్రవారం వలివర్తిపాడు యూపీ పాఠశాలను ఆమె పరిశీలించారు. ఉపాధ్యాయులు విద్యార్థులకు బోధించేది వివరాలు అడిగి తెలుసుకున్నారు. పాఠశాలల్లో విద్యార్థులకు విద్యతోపాటు వ్యాయామం, దేశభక్తిని బోధించాలని తెలిపారు. విద్యాసంవత్సరం వచ్చే ముందే ఇంటింటికీ తిరిగి ప్రైవేట్ పాఠశాలల్లో చదివే విద్యార్థులు గుర్తించి విద్యార్థులను చేర్పించాల్సిందిగా వారి తల్లిదండ్రులను కోరాలని అన్నారు. విద్యార్థులకు గణితంపై పట్టు వచ్చేలా బోధించాలని తెలిపారు. ప్రతీ విద్యార్థిపై ప్రత్యేక శ్రద్ధ తీసుకుని ప్రభుత్వ పాఠశాలలో బాగా చదువు చెబుతున్నారని తెలిపారు. పాఠశాల హెచ్‌ఎం నరసమాంబ, పాల్గొన్నారు.



విద్యార్థులతో మాట్లాడుతున్న ఎంఈవో సీహెచ్.రజని

విన్నకోట పీఏసీఎస్ అధ్యక్షుడిగా బండి రామకృష్ణ

గుడ్లవల్లేరు, సెప్టెంబరు 12 (ఆంధ్రజ్యోతి) : ప్రభుత్వం విడుదల చేసిన త్రీమెన్ కమిటీ జాబితాలో విన్నకోట ప్రాథమిక సహకార పరపతి సంఘం అధ్యక్షుడిగా జనసేన నాయకుడు బండి రామకృష్ణ నియమితులయ్యారు. సభ్యులుగా ఏసుకుమార్ (విన్నకోట), వీరంకి శ్రీవెంకట సత్యనారాయణ(పురిటిపాడు)లు నియమితులయ్యారు.

ముమ్మరంగా వాహన తనిఖీలు

గుడివాడ : స్థానిక నక్కల కాలువ, పెద్దకాలువ సెంటర్‌లలో గురువారం రాత్రి టూటౌన్ సీఐ జె.ఆర్‌కె హనీష్ ఆధ్వర్యంలో వాహన తనిఖీలు, డ్రంక్ అండ్ డ్రైవ్ పరీక్షలు నిర్వహించారు.

గుర్తుతెలియని వ్యక్తి మృతదేహం గుర్తింపు

పెదపారుపూడి: వెంట్రప్రగడ లాకుల దగ్గర సుమారు 30 నుంచి 40 సంవత్సరాల వయస్సు గల ఓ వ్యక్తి మృతదేహం నీటిలో కొట్టుకుని వచ్చింది. మొహం గుర్తు పట్టలేని విధంగా ఉబ్బి ఉంది. మృతుడు నీలరంగు ఫుల్ హ్యాండ్స్ చొక్కా ధరించి ఉన్నాడు. సదరు వ్యక్తి గురించి సమాచారం తెలిస్తే 9440113645, 8332983799కు సమాచారం అందించాలని ఎస్సై ప్రవీణ్ తెలిపారు.

యూరియా కోసం ఆందోళన చెందొద్దు

ఏడీఏ ఎస్. కవిత

గుడివాడ రూరల్, సెప్టెంబరు 12 (ఆంధ్రజ్యోతి): గుడివాడ వ్యవసాయ శాఖ డివిజన్‌లో 195 టన్నులు యూరియా వచ్చిందని శుక్రవారం ఏడీఏ సూరపనేని కవిత అన్నారు. శుక్రవారం కార్యాలయంలో ఆమె మాట్లాడుతూ పెదపారుపూడిలోని ఆరు పీఏసీఎస్‌లకు 125 టన్నులు, నందివాడలో మూడు పీఏసీఎస్‌లకు 45 టన్నులు, గుడివాడలో రెండు పీఏసీఎస్‌లకు 25 టన్నుల యూరియా సరఫరా చేశామని తెలిపారు. రైతులందరికీ అందుబాటు ధరలో యూరియా ఉంచామని తెలిపారు. చాలా మంది రైతులకు యూరియా సక్రమంగా అందిందని తెలిపారు. ప్రతి ఎకరానికీ యూరియా అందించటానికి వ్యవసాయ శాఖ సిద్ధంగా ఉందని తెలిపారు. ప్రతీ గ్రామం, మండలాల వారీగా ఎక్కడ రైతులకు కావాలంటే ఆయా పీఏసీఎస్ సెంటర్లకు పంపించటంతోపాటు పెద్ద పెద్ద గ్రామాలలో పీఏసీఎస్ సెంటర్ల నుంచి వేరేగా పంపుతున్నట్లు తెలిపారు. పీఏసీఎస్ సెంటర్లలో అందరికీ అందేవిధంగా ప్రణాళికాబద్ధంగా ఏర్పాటు చేశామన్నారు. రైతులు ఎటువంటి భయాందోళన చెందవద్దని తెలిపారు. చాలా మంది రైతులకు రెండవ కోటా అయిపోయిందని, మూడవ కోటా అర బస్తా యూరియా, పొటాష్ చల్లుకుంటే సరిపోతుందని తెలిపారు. ఎక్కువగా యూరియానిల్వ చేసుకుంటున్నారని, వచ్చే సీజన్‌కు అది పనికి రాదని తెలిపారు. నూతనంగా యూరియా బస్తాలు తెచ్చుకోవాలని రైతులకు సూచించారు. ఎవరైనా రైతులు నిల్వ చేసుకుంటే సరిహద్దు రైతులకు ఇవ్వాలని తెలిపారు. గుడివాడ మార్కెట్ యార్డులో మట్టి నమూనా కేంద్రం పూర్తిగా పని చేస్తుందని తెలిపారు. గుడ్లవల్లేరు, గుడివాడ, పామర్రు, తోట్లవల్లూరు, పెదపారుపూడి మండలాల్లోని రైతుల మట్టి నమూనాలు పరీక్షించామన్నారు. ప్రస్తుతం పెనమలూరు మండలం మట్టి నమూనాలను పరీక్షిస్తున్నారని ఆమె తెలిపారు.



కురుమద్దాలిలో యూరియా సరఫరాపై రైతుల వివరాలను తెలుసుకుంటున్న బంగార్రాజు

పామర్రు: రైతుల అవసరం మేరకు సమృద్ధిగా యూరియాను నిరంతరం అందించే విధంగా చర్యలు తీసుకోవడం జరుగుతుందని, గ్రామాల్లో రైతులు ఏంతమాత్రం ఆందోళనకు చెందవద్దని జిల్లా విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ డీఎస్పీ వి.బంగార్రాజు అన్నారు. శుక్రవారం మండల పరిధిలోని కురుమద్దాలి,పసుమర్రు గ్రామ సొసైటీల్లో యూరియా పంపిణీ పట్ల రైతుల ఇబ్బందులను క్షేత్రస్థాయి పర్యటన ద్వారా రైతుల అభిప్రాయాలను తెలుసుకున్నారు. ఏడీఏ స్వర్ణలత మాట్లాడుతూ ప్రస్తుతం మండలంలో రైతులు తొలి, రెండవ విడతలో యూరియా తీసుకోనివారిందరికి ప్రాధాన్యతనిస్తున్నమన్నారు. యూరియా సరఫరాలో ఎలాంటి అపోహలు,భయాందోళన చెందవద్దన్నారు. పైరుకు అవసరం మేరకే ఎరువులు వినియోగించుకోవాలని సూచించారు. ఏవో శివనాగరాణి, సచివాలయ సిబ్బందిపాల్గొన్నారు.



బ్రాయిలర్ ధరలు



అమరావతి	(రూ.లలో)
బ్రాయిలర్ బర్డ్	140, 149, 160
చికెన్ విత్ స్కిన్	268
చికెన్ స్కిన్‌లెస్	278

నెక్ కోడిగుడ్డు ధర (100)
విజయవాడ జోన్ రైతు ధర రూ. 545

పీఏసీఎస్‌లకు త్రిసభ్య కమిటీల నియామకం

నాగాయలంక/మోపిదేవి/పెడన రూరల్, సెప్టెంబరు 12(ఆంధ్రజ్యోతి): పీఏసీఎస్‌లకు త్రిసభ్య కమిటీలను నియమిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులిచ్చింది. నాగాయలంక మండలం బర్రంకుల పీఏసీఎస్‌కు చైర్మన్‌గా తోట శ్రీనివాసరావు, సభ్యులుగా కొప్పనాతి వెంటేశ్వరరావు, నాయుడు వెంకటేశ్వరరావును నియమించింది. మోపిదేవి మండలం పెదకళ్లేపల్లి పీఏసీఎస్ చైర్మన్‌గా అరజా రాధిక, సభ్యులుగా పాముల శ్రీనివాసరావు, అనుముకొండ రాజు, మేళ్లమర్తిలంక పీఏసీఎస్ చైర్మన్‌గా నాగినేని ధనుంజయరావు, సభ్యులుగా తోట శరత్‌బాబు, మోర్ల వెంకటేశ్వరరావును నియమించింది. పెడన మండలం పెనుమల్లి పీఏసీఎస్‌కు చైర్మన్‌గా ఊచా వెంకయ్య, సభ్యులుగా పడమట రంగారావు, బొల్లా పుణ్యవతి, ముచ్చర్ల పీఏసీఎస్ చైర్మన్‌గా మోటేపల్లి సురేష్, సభ్యులుగా కాగిత సాగరజంగం, జూత్రు విశ్వేశ్వరరావును నియమించింది.

సమస్యలు పరిష్కరిస్తా

● మంత్రి కొల్లు రవీంద్ర హామీ



ప్రజా దర్బార్‌లో వినతులు స్వీకరిస్తున్న మంత్రి కొల్లు రవీంద్ర

మచిలీపట్నం టౌన్, సెప్టెంబరు 12(ఆంధ్రజ్యోతి): ప్రజాదర్బార్‌లో ప్రజలు అందించిన వినతులు పరిశీలించి, సమస్యలు పరిష్కరిస్తానని మంత్రి కొల్లు రవీంద్ర హామీ ఇచ్చారు. టీడీపీ నియోజకవర్గ కార్యాలయంలో శుక్రవారం నిర్వహించిన ప్రజాదర్బార్ కార్యక్రమంలో ఆయన 38 మంది నుంచి వినతిపత్రాలు స్వీకరించారు. ఎక్కువగా వీధి దీపాలు సమస్యలు, ఇళ్ల స్థలాలు ఇప్పించాలని వినతిపత్రాలు వచ్చాయని తెలిపారు. మార్కెట్‌యార్డు మాజీ చైర్మన్ గోపు సత్యనారాయణ, మునిసిపల్ మాజీ చైర్మన్ మోటమర్రి బాబాప్రసాద్, టీడీపీ నగర అధ్యక్షుడు లోగిశెట్టి వెంకటస్వామి, నాయకులు గొర్రెపాటి గోపీచంద్, ఎండి ఇలియాస్ పాషా పాల్గొన్నారు.

పేర్ని నానీ.. కుల రాజకీయాలు చేయొద్దు

● టీడీపీ నగర అధ్యక్షుడు లోగిశెట్టి వెంకటస్వామి

మచిలీపట్నం టౌన్, సెప్టెంబరు 12(ఆంధ్రజ్యోతి): మాజీ మంత్రి పేర్ని నానీ కుల రాజకీయాలు చేస్తూ ప్రజలను రెచ్చగొడుతూ తప్పుదోవపట్టిస్తున్నారని, అవి మానుకోవాలని టీడీపీ నగర అధ్యక్షుడు లోగిశెట్టి వెంకటస్వామి హితవు పలికారు. శుక్రవారం టీడీపీ కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. జనసేన అధినేత పవన్‌కల్యాణ్‌ను ఎవరైనా విమర్శిస్తే దాన్ని పార్టీల మధ్య విభేదాలుగా చూడకుండా కులాల మధ్య గొడవలు రేపాలని పేర్ని నాని ప్రయత్నిస్తున్నారని ఆయన అన్నారు. గతంలో పేర్ని నాని చేసిన వ్యాఖ్యలతో అనేక వివాదాలు ఏర్పడ్డాయన్నారు. మళ్లీ రాజకీయ డ్రామాలు ప్రారంభించారన్నారు. బీసీలకు అన్యాయం జరిగిందంటూ పేర్ని నానీ కపట ప్రేమ ఒలకబోస్తున్నారని టీడీపీ 18వ డివిజన్ నాయకుడు గోకుల శివ అన్నారు. వైసీపీ ప్రభుత్వ హయాంలో 38 బీసీ కులాల వారు పలు ఇబ్బందులకు గురయ్యారన్నారు. 39వ డివిజన్ నాయకుడు కట్టా అంజిబాబు, 49వ డివిజన్ నాయకుడు ఊకంటి రాంబాబు మాట్లాడుతూ వైసీపీ హయాంలో రజకుల ఇళ్లపై దాడి జరిగినపుడు పేర్ని నానీ మౌనంగా ఉన్నారన్నారు. మంత్రి కొల్లు రవీంద్ర వద్ద పనిచేసే అటెండర్‌ను పోలీసుస్టేషన్‌లో కొట్టించిన సంగతి ప్రజలు మరచిపోలేదన్నారు.



టీడీపీ మండల అధ్యక్షుడు బండే శ్రీనివాసరావును సత్కరిస్తున్న నియోజకవర్గ పరిశీలకుడు కనపర్తి శ్రీనివాసరావు

నిబద్ధత గల నాయకుడు బండే శ్రీనివాసరావు

కోడూరు, సెప్టెంబరు 12(ఆంధ్రజ్యోతి): టీడీపీ మండల అధ్యక్షుడు బండే శ్రీనివాసరావు పార్టీలో 30 ఏళ్లుగా నిబద్ధతతో పని చేస్తున్నారని నియోజకర్గ పరిశీలకుడు కనపర్తి శ్రీనివాసరావు అన్నారు. గురువారం రాత్రి యర్రారెడ్డిపాలెంలో నిర్వహించిన బండే శ్రీనివాసరావు జన్మదిన వేడుకల్లో ఏఎంసీ చైర్మన్ కొల్లూరి వెంకటేశ్వరరావు, టీడీపీ సీనియర్ నాయకుడు బొబ్బా గోవర్ధన్‌తో కలిసి కనపర్తి పాల్గొన్నారు. ప్రతిపక్షంలో ఉన్నప్పుడు బండే శ్రీనివాసరావును ప్రజా సమస్యలపై నిరంతర పోరాటాలు చేశారని, కార్యకర్తలకు అండగా నిలిచారని, కష్ట సమయంలో పార్టీని వీడకుండా వెన్నంటి ఉండి నడిపించారని అభినందించారు. శ్రీనివాసరావు మరిన్ని ఉన్నత పదవులు అధిరోహించాలని ఆకాంక్షించారు. గజమాల వేసి సత్కరించి కేక్ కట్ చేశారు. నాయకులు కర్రా సుధాకర్, మేడికొండ విజయ్, కోట సాయి, బండే రాఘవ, పూతబోయిన శ్రీనివాసరావు, వేములపల్లి రాజేష్, పిల్లి మల్లికార్జునరావు, అప్పికట్ల రవీంద్ర, కొక్కిలిగడ్డ జాన్ విల్సన్, టీడీపీ నాయకులు పాల్గొన్నారు.



విక్కుర్తి శ్రీనివాస్‌ను గజమాలతో సత్కరిస్తున్న అభిమానులు

ఘనంగా విక్కుర్తి శ్రీనివాస్ జన్మదినోత్సవం

అవనిగడ్డ/చల్లపల్లి, సెప్టెంబరు 12(ఆంధ్రజ్యోతి): పారిశ్రామికవేత్త, కూటమి నాయకుడు విక్కుర్తి శ్రీనివాస్ జన్మదిన వేడుకలు విక్కుర్తి వీరరాఘవయ్య ట్రస్ట్ కార్యాలయంలో శుక్రవారం నిర్వహించారు. విక్కుర్తి శ్రీనివాస్ 50 కిలోల కేక్ కట్ చేశారు. అవనిగడ్డ ఏరియా ఆస్పత్రిలో రోగులకు పండ్లు, రొట్టెలు పంపిణీ చేశారు. నియోజకవర్గంలోని పలువురు నేతలు ఆయనను సత్కరించి శుభాకాంక్షలు తెలిపారు. విక్కుర్తి రామకృష్ణ, విక్కుర్తి రాంబాబు, పులిగడ్డ చంద్ర, బర్మా శ్రీనివాసరావు పాల్గొన్నారు. చల్లపల్లి సీయోను వృద్ధాశ్రమంలో పుట్టినరోజు వేడుకలు జరుపుకొని వృద్ధులకు విక్కుర్తి శ్రీనివాస్ ఆహారం అందించారు.

సమన్వయంతో పనిచేసి
మండలాన్ని అభివృద్ధి చేద్దాం



మాట్లాడుతున్న ఎంపీపీ సంగా మధుసూదనరావు

గూడూరు, సెప్టెంబరు 12(ఆంధ్రజ్యోతి): అధికారులు, ప్రజా ప్రతినిధులు సమన్వయంతో పనిచేసి మండలాన్ని అభివృద్ధి చేద్దామని ఎంపీపీ సంగా మధుసూదనరావు అన్నారు. శుక్రవారం మండల పరిషత్ కార్యాలయంలో నిర్వహించిన సర్వసభ్య సమావేశంలో ఆయన మాట్లాడారు. పార్టీలకతీతంగా మండల అభివృద్ధికి కృషి చేస్తామని, కూటమి ప్రభుత్వం ఎన్నికల్లో ఇచ్చిన హామీలు నెరవేర్చిందని డీసీ చైర్మన్ పోతన స్వామి అన్నారు. తన గ్రామంలో ఇళ్ల స్థలాలు, శ్మశాన వాటిక దగ్గరలో ఇచ్చారని, అలా కాకుండా గ్రామ సమీపంలో ఇవ్వాలని తరకటూరు ఎంపీటీసీ సభ్యుడు జక్కా ధర్మారాయుడు కోరారు. చేనేత కార్మికులకు పనికి తగ్గ కూలి, బకాయిలు, నేతన్న నేస్తం అందక ఇబ్బందులు పడుతున్నారని ఎంపీపీ, ఎండీవోకు కప్పలదొడ్డి సర్పంచ్ యక్కల మాధవి, ఎంపీటీసీ సభ్యురాలు పేరిశెట్టి తేజావతి వినతిపత్రం అందచేశారు. జడ్పీటీసీ సభ్యుడు వేముల సురేష్ రంగబాబు, వైస్ ఎంపీపీలు నేతల కుటుంబరావు, పిచ్చుక గంగాధరరావు, ఇన్‌చార్జి ఎండీవో కె.వి.రామకృష్ణ, తహసీల్దార్ డి.రాజ్యలక్ష్మి, ఎంపీటీసీ సభ్యులు, సర్పంచ్‌లు, అధికారులు పాల్గొన్నారు.

అయ్యప్ప దీక్షా ప్రచార సమితి
మండలాధ్యక్షుడిగా కొత్త మురళీకృష్ణ

పెడన, సెప్టెంబరు 12(ఆంధ్రజ్యోతి): అఖిల భారత అయ్యప్ప దీక్షా ప్రచార సమితి మండల అధ్యక్షుడుగా కొత్త మురళీకృష్ణ నియమితులయ్యారు. మురళీకృష్ణను వాసవీ కన్యకా పరమేశ్వరీ దేవి ఆలయ ప్రాంగణంలో శుక్రవారం సత్కరించారు. సమితి జిల్లా ఉపాధ్యక్షుడు ఎస్.పిచ్చిబాబు, రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ వి. వెంకటేశ్వరరావు, ఆర్యవైశ్యుల పరిరక్షణ సమితి వ్యవస్థాపకుడు డాక్టర్ కొల్లూరి చిన్నా తదితరులు పాల్గొన్నారు.

పీఆర్సీ కమిషన్ నియమించాలి

● తహసీల్దార్ కార్యాలయాల వద్ద ఏపీటీఎఫ్ ధర్నా

మచిలీపట్నం టౌన్, సెప్టెంబరు 12(ఆంధ్రజ్యోతి): పీఆర్సీ కమిషన్‌ను వెంటనే నియమించాలంటూ మచిలీపట్నం తహసీల్దార్ కార్యాలయం వద్ద శుక్రవారం ఏపీటీఎఫ్ నాయకులు ధర్నా నిర్వహించారు. పెండింగ్‌లో ఉన్న డీఏ బకాయిలు చెల్లించాలని, నూతనంగా డీఎస్సీలో నియమితులైన టీచర్లకు పాత పీఆర్సీ ఇవ్వాలని డిమాండ్ చేశారు. డిప్యూటీ తహసీల్దార్ సత్యనారాయణకు వినతిపత్రం అందించారు. జిల్లా అధ్యక్షుడు సుబ్రహ్మణ్యం ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో నాయకులు ఎ.రామ్‌గోపాల్, సురేష్, కోటయ్య, రవిప్రసాద్ పాల్గొన్నారు.

మోపిదేవి: ఉద్యోగులు, ఉపాధ్యాయుల దీర్ఘకాలిక సమస్యలు పరిష్కరించాలని ఏపీటీఎఫ్ మండల నాయకులు శుక్రవారం తహసీల్దార్ ఎం.హరనాథ్‌కు వినతిపత్రం అందజేశారు. ఏపీటీఎఫ్ మండల శాఖ అధ్యక్షుడు ఎం.వి.రమణ ఆధ్వర్యంలో కార్యాలయం వద్ద నిరసన తెలిపారు. పెండింగ్‌లో ఉన్న నాలుగు డీఏలు విడుదల చేయాలని, సీపీఎస్ రద్దు చేసి మెమో నెంబర్ 57ను విడుదల చేయాలని, 12వ పీఆర్సీ కమిషన్ నియమించి ఐఆర్‌ను వెంటనే ప్రకటించాలని డిమాండ్ చేశారు. అన్ని బకాయిలు వెంటనే చెల్లించాలని వినతిపత్రం అందజేశారు. మండల శాఖ ప్రధాన కార్యదర్శి కృష్ణకాంత్, జిల్లా ప్రధాన కార్యదర్శి విశ్వనాథపల్లి సాంబశివరావు, జిల్లా కౌన్సిల్ సభ్యులు సుబ్బారావు, దర్మజ్ఞాని పాల్గొన్నారు.



మచిలీపట్నంలో డిప్యూటీ తహసీల్దార్ సత్యనారాయణకు వినతిపత్రం అందిస్తున్న ఏపీటీఎఫ్ నాయకులు



మోపిదేవిలో తహసీల్దార్ హరనాథ్‌కు వినతిపత్రం అందజేస్తున్న ఏపీటీఎఫ్ నాయకులు

బియ్యంలో పురుగులు రావడంపై విచారణ



విద్యార్థులతో మాట్లాడుతున్న డీఈవో కార్యాలయ ఏడీ ఎం.విద్యాలత

చల్లపల్లి, సెప్టెంబరు 12 (ఆంధ్రజ్యోతి): బియ్యంలో పురుగులు వచ్చిన ఉదంతంపై విచారణ చేసేందుకు పురిటిగడ్డ జిల్లాపరిషత్ హైస్కూల్(ప్లస్)ను డీఈవో కార్యాలయ అసిస్టెంట్ డైరెక్టర్(మధ్యాహ్న భోజన పథకం) ఎం.విద్యాలత శుక్రవారం సందర్శించారు. ఉపాధ్యాయులు, ఎస్ఎంసీ కమిటీ సభ్యులు, విద్యార్థులతో మాట్లాడారు. భోజనం ఎలా ఉంటుంది. 10వ తేదీన మాత్రమే పురుగులు వచ్చాయా.. గతంలో ఎప్పుడైనా వచ్చాయా అని విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. వంట ఏజెన్సీవారితో మాట్లాడి మధ్యాహ్న భోజనం తయారు చేస్తున్న తీరును పరిశీలించారు. భోజనం చేశారు. తనిఖీ వివరాలను డీఈవోకు అందజేస్తామని విద్యాలత తెలిపారు. ఎంఈవో పి.వెంకటేశ్వరరావు, హెచ్ఎం కెబీఎస్.శర్మ, ఉపాధ్యాయులు పాల్గొన్నారు. పురిటిగడ్డ హైస్కూల్ (ప్లస్)ను సాయంత్రం మచిలీపట్నం డీవైఈవో బీఎస్సీ శేఖర్‌సింగ్ సందర్శించారు. అన్నంలో పురుగులు వచ్చిన సంఘటనపై విద్యాకుటుంబాన్ని, కుకింగ్ ఏజెన్సీ నిర్వాహకులను విచారించారు. కొత్తగా పాఠశాలకు వచ్చిన బియ్యాన్ని పరిశీలించారు.

అదనపు బాధ్యతలు అప్పగించొద్దు



మోపిదేవిలో ఎంపీడీవో స్వర్ణభారతికి వినతిపత్రం అందజేస్తున్న గ్రామ సచివాలయ ఉద్యోగులు

మోపిదేవి, సెప్టెంబరు 12 (ఆంధ్రజ్యోతి): తమకు ప్రభుత్వం అదనపు బాధ్యతలు అప్పగించడాన్ని నిరసిస్తూ శుక్రవారం ఎంపీడీవో జె.స్వర్ణభారతికి మండలంలోని 12 గ్రామ సచివాలయాల్లో పని చేస్తున్న 110 మంది ఉద్యోగులు వినతిపత్రం అందజేశారు. ఇంటింటికీ తిరిగి విధులు నిర్వహించటం వల్ల క్షేత్రస్థాయిలో అవమానాలకు గురవు తున్నామని వారు ఆవేదన వ్యక్తం చేశారు. విద్యార్హతల ఆధారంగా విధులు అప్పగించేలా చూడాలని కోరారు.

పెడన: రాష్ట్ర గ్రామ, వార్డు సచివాలయాల జేఏసీ ఇచ్చిన పిలుపు మేరకు పట్టణంలోని సచివాలయాల ఉద్యోగులు తమ సమస్యలపై మునిసిపల్ కమిషనర్ ఎల్.చంద్రశేఖరరెడ్డికి వినతిపత్రం ఇచ్చారు. సమస్య లను ప్రభుత్వం దృష్టికి తీసుకువెళతానని కమిషనర్ వారికి హామీ ఇచ్చారు.

పుష్కలంగా యూరియా

చల్లపల్లి, సెప్టెంబరు 12(ఆంధ్రజ్యోతి): మండలానికి యూరియా పుష్కలంగా వచ్చింది. చల్లపల్లి సొసైటీకి 10.10 టన్నులు, లక్ష్మీపురం సొసైటీకి 20 టన్నులు, మంగళాపురం సొసైటీకి 20 టన్నులు, మాజేరు సొసైటీకి 20 టన్నులు, పురిటిగడ్డ సొసైటీకి 20 టన్నులు, వక్కలగడ్డ సొసైటీకి 15 టన్నులు, లక్ష్మీపురంలో ప్రైవేటు డీలర్లకు 18 టన్నులు, పురిటిగడ్డలో ప్రైవేటు డీలరుకు 49.50టన్నులు చొప్పున మొత్తం 174.20 మెట్రిక్ టన్నుల యూరియా వచ్చింది. దీంతో గ్రామాల్లో ముమ్మరంగా యూరియా పంపిణీ జరిగింది. ఏవో కె.మురళీకృష్ణ పర్యవేక్షించారు. లక్ష్మీపురం ప్రైవేట్ డీలరు వద్ద యూరియా పంపిణీని తహసీల్దార్ డి.వనజాక్షి, ఏవో మురళీకృష్ణ పరిశీలించారు.

మోపిదేవి మండలంలో..

మోపిదేవి: రావివారిపాలెం, మెరకనపాలెం, కె.కొత్తపాలెం, మేళ్లమర్తిలంక పీఏసీఎస్‌ల వద్ద యూరియా పంపిణీని ఏవో కె.హెబ్సిబారాణి పరిశీలించారు. రావివారిపాలెం పీఏసీఎస్ వద్ద చైర్మన్ పరుచూరి శ్రీనివాసరావుతో కలసి ఆమె రైతులకు యూరియా పంపిణీని ప్రారంభించారు. మెరకనపల్లి పీఏసీఎస్‌కు పది టన్నులు, మేళ్లమర్తిలంకకు 15 టన్నులు, పెదకళ్లేపల్లికి 15, వెంకటాపురం 10, అడపావారిపాలెం 15, మోపిదేవి 20, కొక్కిలిగడ్డ 15, కె.కొత్తపాలెం 15 టన్నుల చొప్పున యూరియా అందుబాటులో ఉన్నట్లు తెలిపారు. మోపిదేవి, కోసూరువారిపాలెం ప్రైవేట్ దుకాణాల్లోనూ అందుబాటులో ఉందని తెలిపారు.



చల్లపల్లిలో యూరియా పంపిణీ చేస్తున్న సొసైటీ చైర్మన్ బొందలపాటి వీరబాబు, ఏవో మురళీకృష్ణ

స్వచ్ఛాంధ్ర కార్పొరేషన్ డైరెక్టర్‌గా
బోలెం నాగమణి ప్రమాణస్వీకారం



స్వచ్ఛాంధ్ర కార్పొరేషన్ చైర్మన్ కొమ్మారెడ్డి పట్టాభిరామ్‌తో బోలెం నాగమణి దంపతులు

చల్లపల్లి, సెప్టెంబరు 12 (ఆంధ్రజ్యోతి): స్వచ్ఛాంధ్ర కార్పొరేషన్ డైరెక్టరుగా బోలెం నాగమణి శుక్రవారం విజయవాడ తుమ్మలపల్లి కళాక్షేత్రంలో ప్రమాణ స్వీకారం చేశారు. స్వచ్ఛాంధ్ర కార్పొరేషన్ చైర్మన్ కొమ్మారెడ్డి పట్టాభిని నాగమణి..బోలెం రామారావు దంపతులు మర్యాదపూర్వకంగా కలిశారు.

బుద్దాలపాలెం పీఏసీఎస్ చైర్మన్‌గా
కొక్కు లక్ష్మణరావు ప్రమాణస్వీకారం



కొక్కు లక్ష్మణరావును అభినందిస్తున్న డీసీఎంఎస్ చైర్మన్ బండి రామకృష్ణ

మచిలీపట్నం టౌన్, సెప్టెంబరు 12 (ఆంధ్రజ్యోతి): బందరు మండలం బుద్దాలపాలెం పీఏసీఎస్ చైర్మన్‌గా కొక్కు లక్ష్మణరావు శుక్రవారం ప్రమాణ స్వీకారం చేశారు. కార్యక్రమంలో డీసీఎంఎస్ అధ్యక్షుడు బండి రామకృష్ణ, మార్కెట్ యార్డు చైర్మన్ కుంచే నాని, టీడీపీ నాయకులు గొర్రెపాటి గోపీచంద్, పిప్పళ్ల కాంతారావు, జనసేన నాయకుడు మాది వాడ రాము, న్యాయవాది లంకిశెట్టి బాలాజీ పాల్గొన్నారు.

నేడు వ్యవసాయ విద్యుత్ నిలుపుదల

చల్లపల్లి, సెప్టెంబరు 12(ఆంధ్రజ్యోతి): 132/33 పామర్రు సబ్‌స్టేషన్ మరమ్మతుల నిమిత్తం శనివారం ఉదయం 8 గంటల నుంచి 11 గంటల వరకు చల్లపల్లి సబ్‌డివిజన్‌లోని చల్లపల్లి, మోపిదేవి, ఘంటసాల మండలాల్లో వ్యవసాయ ఫీడర్లకు విద్యుత్ సరఫరా నిలుపుదల చేస్తామని విద్యుత్ శాఖ ఉయ్యూరు ఈఈ టి.కృష్ణానాయక్, చల్లపల్లి డీఈఈ పులి శివనాగేశ్వరరావు తెలిపారు. వ్యవసాయ విద్యుత్ వినియోగదారులు సహకరించాలని కోరారు.

చేవెంద్ర చోరీ ఘటనపై దర్యాప్తు ముమ్మరం

పెడన, సెప్టెంబరు 12(ఆంధ్రజ్యోతి): చేవేంద్ర గ్రామంలో అంకెం కమలాకరరావు ఇంట్లో బుధవారం జరిగిన చోరీ ఘటనపై పోలీసులు దర్యాప్తు ముమ్మరం చేశారు. 25 కాసుల బంగారం, కిలో వెండి, రూ.2 లక్షల నగదును దొంగలు అపహరించుకుపోయిన విషయం విదితమే. దొంగలను పట్టుకునేందుకు పోలీసులు స్పెషల్ ఇన్వెస్టిగేషన్ టీమ్‌ను ఏర్పాటు చేశారు. అనుమానితులను పోలీసు స్టేషన్‌కు తీసుకొచ్చి విచారించి పంపేస్తున్నారు. దర్యాప్తులో భాగంగా సీఐ నాగేంద్రప్రసాద్, ఎస్సై సత్యనారాయణ శుక్రవారం చేవేంద్ర వెళ్లి వివరాలు సేకరించారు.

వైభవంగా గంగానమ్మ జాతర

బంటుమిల్లి, సెప్టెంబరు 12(ఆంధ్రజ్యోతి): రామవరపుమోడీ గ్రామంలో గ్రామ దేవత గంగానమ్మ, పోతురాజు, చల్లాలమ్మ, మారెమ్మ జాతర శుక్రవారం వైభవంగా జరిగింది. పుర వీధుల్లో గ్రామోత్సవం నిర్వహించారు. ఆలయ కమిటీ ఆధ్వర్యంలో పూజలు నిర్వహిస్తున్నారు.

విపత్తుల నిర్వహణపై అవగాహన

కోడూరు, సెప్టెంబరు 12(ఆంధ్రజ్యోతి): తుఫాన్లు, సునామీలు వంటి విపత్తుల సమయంలో మత్స్యకారులు తమను తాము ఎలా కాపాడుకోవాలో అవగాహన పెంచుకోవాలని పాలకాయతిప్ప మెరైన్ ఎస్సై పూర్ణమాధురి సూచించారు. శుక్రవారం సముద్రతీర ప్రాంతమైన హంసలదీవి గ్రామంలో మత్స్యకారులకు నిర్వహించిన అవగాహన సదస్సులో ఆమె మాట్లాడారు. మత్స్యకారులకు సముద్ర భద్రత, పర్యావరణ పరిరక్షణ, విపత్తు నిర్వహణ, సుస్థిర జీవన శైలి వంటి అంశాలపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో ఎస్సై చాణక్య, వీఆర్వో గోపాలకృష్ణ, ఫారెస్ట్ హెడ్ కానిస్టేబుల్ వి.సత్యనారాయణ, సంఘమిత్ర సీహెచ్ మోషి పాల్గొన్నారు.

సముద్రపు నాచు పెంపకంపై శిక్షణ

నాగాయలంక, సెప్టెంబరు 12(ఆంధ్రజ్యోతి): మత్స్యశాఖ ఆధ్వర్యంలో శుక్రవారం సొర్లగొంది గ్రామంలో మత్స్యకార మహిళలు, డ్వాక్రా మహిళలకు సముద్రపు నాచు పెంపకంపై ఒక రోజు శిక్షణ తరగతులను నిర్వహించారు. ప్రోటీన్లు అధికంగా ఉండే ఈ నాచును ఔషధాలు, కేకులు, ఇతర ఆహార పదార్థాలు, రసాయనాల్లో వినియోగిస్తున్నారని భావదేవరపల్లి మత్స్యపాలిటెక్నిక్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఎ.చంద్రశేఖర్ వివరించారు. సముద్రపు నాచును పెంచే వారికి మత్స్యశాఖ రాయితీలు అందిస్తోందని మత్స్యశాఖ అభివృద్ధి అధికారులు ఆర్.ప్రతిభ, టి.సునీత తెలిపారు. అనంతరం గ్రామంలో అవగాహనా ర్యాలీని నిర్వహించారు. సిబ్బంది పర్యవేక్షించారు.

గురుకుల విద్యాలయం
ఇన్‌చార్జ్ ప్రిన్సిపాల్‌గా శ్రీనివాస్

అవనిగడ్డ రూరల్, సెప్టెంబరు 12(ఆంధ్రజ్యోతి): పులిగడ్డలోని గురుకుల విద్యాలయానికి ఇన్‌చార్జి ప్రిన్సిపాల్‌గా శ్రీనివాస్ శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. ఇప్పటి వరకు ఇన్‌చార్జి ప్రిన్సిపాల్‌గా పని చేసిన అనిల్‌కుమార్ లెక్చరర్‌గా పదోన్నతి పొందటంతో ఆయన స్థానంలో శ్రీనివాస్ బాధ్యతలు స్వీకరించారు.

రేపు ల్యాబ్ టెక్నీషియన్ల సమావేశం

చల్లపల్లి, సెప్టెంబరు 12(ఆంధ్రజ్యోతి): ప్రైవేట్ ల్యాబ్ అండ్ రేడియోగ్రాఫర్ టెక్నీషియన్ల జిల్లా సమావేశం ఆదివారం మధ్యాహ్నం రెండు గంటలకు మచిలీపట్నం పరాసుపేటలోని సత్య మినీ ఫంక్షన్ హాలులో నిర్వహిస్తామని యూనియర్ నాయకుడు కొల్లూరి కృష్ణ తెలిపారు. సమావేశంలో రాష్ట్ర అధ్యక్షుడు మూర్తి, కార్యదర్శి శర్మ పాల్గొంటారని, జిల్లా యూనియన్ ఏర్పాటుపై చర్చిస్తారని తెలిపారు.

సాంబశివరావుకు బెస్ట్ ఎడ్యుకేషనిస్టు అవార్డు

మచిలీపట్నం టౌన్, సెప్టెంబరు 12(ఆంధ్రజ్యోతి): 33 ఏళ్లుగా విద్యారంగానికి అందిస్తున్న సేవలకు గుర్తుగా నగరానికి చెందిన సాహితీవేత్త పన్యారం సాంబశివరావుకు న్యూఢిల్లీలోని హెచ్ఆర్టీ సంస్థ బెస్ట్ ఎడ్యుకేషనిస్టు అవార్డు, బంగారు పతకాన్ని అందించింది. డీఈవో పి.వి.జె.రామారావు, కిషోర్‌కుమార్, హసీంబేగ్ అభినందనలు తెలిపారు.

తాత్కాలిక పైపుల ద్వారా
ఈలచెట్లదిబ్బకు సాగునీరందిస్తాం

● అధికారుల ప్రకటన



లంకేవానిదిబ్బ, ఈలచెట్లదిబ్బ గ్రామస్థులతో మాట్లాడుతున్న గుంటూరు, కృష్ణా జిల్లాల అధికారులు

నాగాయలంక, సెప్టెంబరు 12(ఆంధ్రజ్యోతి): రాజు కాల్వ నుంచి తాత్కాలిక పైపులు ఏర్పాటు చేసి వారం లోగా ఈలచెట్లదిబ్బకు సాగునీరు, ప్రజలకు తాగునీరును అందిస్తామని గుంటూరు, కృష్ణా జిల్లాల అధికారులు శుక్రవారం ప్రకటించారు. లంకేవానిదిబ్బ, ఈలచెట్ల దిబ్బ గ్రామస్థులతో వారు మాట్లాడారు. నీరు విడుదలలో లెవల్ మెయింటెన్ చేస్తామని అధికారులు వెల్లడించారు. బాపట్ల జిల్లాలోని లంకెవానిదిబ్బ వద్ద గల లిఫ్ట్ ఇరిగేషన్ స్కీమ్‌ను బాపట్ల, కృష్ణా జిల్లాల ఇరిగేషన్, లిఫ్ట్ ఇరిగేషన్, రెవెన్యూ అధికారులు, స్థానిక నాయకులు పరిశీలించారు. గుంటూరు జిల్లా లిఫ్ట్ ఇరిగేషన్ ఈఈ చెన్నారెడ్డితోపాటు ఇరిగేషన్ అధికారులు, రెవెన్యూ శాఖ అధికారులు, కృష్ణా జిల్లాకు చెందిన ఇరిగేషన్ ఎస్ఈ మోహనరావు, ఈఈ రావెళ్ల రవికిరణ్, డీఈఈ గణపతి, ఏఈ పి.రవితేజ, బందరు ఆర్డీవో ఈ.శ్రీదేవి, చిలకలపూడి పాపారావు, అనగాని శివప్రసాద్, నాగాయలంక తహసీల్దార్ వీరాంజనేయ ప్రసాద్, అవనిగడ్డ సీఐ యువకుమార్, నీటి సంఘం అధ్యక్షుడు అవనిగడ్డ వెంకటేశ్వరరావు పాల్గొన్నారు. ఇరు గ్రామాల మధ్య ఉన్న సమస్యను పరిష్కరించారు.

అంతిమ సంస్కారాలకు ఆర్థిక సాయం

గూడూరు, సెప్టెంబరు 12(ఆంధ్రజ్యోతి): మల్లవోలుకు చెందిన ఒగ్గిశెట్టి అనుబాబు క్యాన్సర్ కారణంగా గురువారం మృతిచెందాడు. ఆయన అంతిమ సంస్కారాలకు శుక్రవారం హెల్పింగ్ హ్యాండ్స్ స్వచ్ఛంద సేవా సంస్థ రూ.5వేలు అందించింది. పడవల మోహన్‌త్రినాథ్, కోలా వాసు పాల్గొన్నారు.